

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV — STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 38 | ఎడిటర్ : బరిగెల శివ | గురువారం 08, జనవరి 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాజ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్






# భూ భారతి.. బాధలు !






డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్




ఎవరికి మేలు చేస్తున్న భూ భారతి చట్టం

భూ భారతి ట్రిబనల్ కోర్టుకు చట్టబద్ధత,న్యాయబద్ధత ఎలా కల్పిస్తారు

అసైన్డ్ భూముల పట్టాలు ఎందుకు ఆపారు

రాష్ట్ర విభజనలో తెలంగాణ విస్తీర్ణం ఎంత... ప్రస్తుత విస్తీర్ణం ఎంత

చెరువుల పరిరక్షణకు ప్రభుత్వం తరపున ప్రత్యేక చర్యలు ఎక్కడ

తెలంగాణ రాష్ట్రంలో భూ భారతి అనే చట్టం పనిచేస్తుందా


పాత ప్రభుత్వం మోసం చేస్తే ప్రస్తుత ప్రభుత్వం చేసేదేంటి

పేదవాని భూమిని కాపాడడానికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలేంటి

పహానిలను సవరించే హక్కులు ఎవరికిచ్చారు

1954 రికార్డులన్నీ ఉన్నాయా మాయమయ్యాయా

డాక్టర్ బరిగెల శివ




హైదరాబాద్
(జై భీమ్ డెస్క్)

తెలంగాణ రాష్ట్రంలో భూ భారతి చట్టం ఎలా పనిచేస్తుందో ప్రభుత్వానికే క్లారిటీ లేదని డాక్టర్ బరిగెల శివ పేర్కొన్నారు.గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి చట్టంలోని నియమాలనే నేటికీ కొనసాగిస్తూ తెలంగాణ రాష్ట్రంలో భూ సమస్యల పట్ల శాశ్వత పరిష్కార మార్గం చూపిస్తామని ప్రభుత్వం తరపున నాయకులు ప్రతిపాదిస్తూ మాట్లాడుతుండడం వినడానికి విడ్డూరంగా ఉందన్నారు. 1954 రివిజన్ చట్టం ప్రకారం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి విస్తీర్ణానికి తెలంగాణ చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో భూ రికార్డుల వివరాలు ఉన్నాయా మాయం చేశారా అంటూ తెలంగాణ ప్రజలు అడుగుతున్నారు అన్నారు.

ఇళ్ల స్థలాలకు రైతు భరోసాతో పాటు వ్యవసాయ పాస్ బుక్కులు ఎలా మంజూరు చేయబడుతున్నారో ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలలో జిల్లా కేంద్రాలలో ధరణి చట్టమే కొనసాగుతుందని దానికి బాధ్యులు ఎవరో ప్రభుత్వం తరపున సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.హద్దులు లేని తప్పుడు సాదా పేపర్లకు పాస్ బుక్కులు మంజూరు చేస్తూ చట్టబద్ధత కల్పించడం సుప్రీంకోర్టు నియమాలకు విరుద్ధం కాదా అంటూ సూటిగా ప్రశ్నించారు.రాష్ట్రవ్యాప్తంగా త్వరలో భూ భారతి ట్రిభునల్ చట్టం తీసుకురాబోతున్నామని ప్రకటిస్తున్న ప్రభుత్వ ప్రతినిధి గతంలోకొనసాగించిన ధరణి ట్రిబ్యునల్ కోర్టు పూర్తిగా విఫలమైందని ప్రస్తుతం భూ భారతి ట్రిబ్యునల్ ఏ విధమైన చట్టబద్ధతతో, న్యాయబద్ధతతో ముందుకు వస్తుందో ప్రజలకు

- మిగతా 2లో..






## రూ.1 లక్ష లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన రంగారెడ్డి జిల్లా అధికారులు

ఏసీబీకి చిక్కిన నందిగామ ఎంపీడీవో, ఏపీవో, ఈదులపల్లి కార్యదర్శి

ఇంటి నిర్మాణానికి సంబంధించి రూ.3.5 లక్షలు డిమాండ్ చేసిన అధికారులు

రెండోసారి రూ.1 లక్ష చెల్లిస్తుండగా పట్టుకున్న ఏసీబీ అధికారులు

వివరాలు 4లో

## ఫోన్ ట్యాపింగ్ కేసులో రేవంత్ రెడ్డి సోదరుడికి సిట్ నోటీసులు

తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో కొత్త పరిణామాలు

రేపు విచారణకు రావాలంటూ కొండల్ రెడ్డికి సిట్ నోటీసులు

బీఆర్ఎస్ హయాంలో కొండల్ రెడ్డి ఫోన్ ట్యాప్ చేసినట్టు దర్యాప్తులో తేలిన వైనం

2






## భార్య వంట చేయట్లేదని విడాకులు కావాలంటూ భర్త పిటిషన్..

తెలంగాణ హైకోర్టు ఏం చెప్పిందంటే..!

భర్త పిటిషన్‌ను కొట్టివేసిన తెలంగాణ హైకోర్టు

ఉద్యోగం చేసే భార్య ఇంటిపని చేయకపోవడం క్రూరత్వం కాదని వ్యాఖ్య

బాధ్యతలను సమానంగా పంచుకోవాలని ధర్మాసనం హితవు

2

## రూ.50,000 లంచం తీసుకుంటూ..

ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ తహసీల్దార్

కామారెడ్డి జిల్లాలో లంచం తీసుకుంటూ పట్టుబడ్డ తహసీల్దార్

భూమి బదిలీ రిపోర్ట్ కోసం రూ.50 వేలు డిమాండ్

ప్రైవేట్ వ్యక్తి ద్వారా లంచం స్వీకరిస్తూ ఏసీబీకి చిక్కిన వైనం

తహసీల్దార్, మధ్యవర్తిని అరెస్ట్ చేసిన అధికారులు

లంచం అడిగితే 1064కి కాల్ చేయాలని ఏసీబీ సూచన



## పవన్ జాగ్రత్త..

### వైఎస్సార్‌లా చనిపోతావ్: కేఏ పాల్

పవన్ కల్యాణ్‌పై కేఏ పాల్ సంచలన వ్యాఖ్యలు

తాను ప్రార్థిస్తే వైఎస్సార్‌లా మరణిస్తారని హెచ్చరిక

గద్దర్‌ది సహజ మరణం కాదు.. హత్యేనని ఆరోపణ

వెనిజువెలా అధ్యక్షుడి కిడ్నాప్‌పై మోదీ మౌనాన్ని ప్రశ్నించిన పాల్



2

జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE
సామాన్యుడి ఆయుధంగా

# పవన్ జాగ్రత్త.. వైఎస్సార్‌లా చనిపోతావ్: కేఏ పాల్

**పవన్ కల్యాణ్‌పై కేఏ పాల్ సంచలన వ్యాఖ్యలు**
**తాను ప్రార్థిస్తే వైఎస్సార్‌లా మరణిస్తారని హెచ్చరిక**
**గద్దర్‌ది సహజ మరణం కాదు.. హత్యేనని ఆరోపణ**
**వెనిజువెలా అధ్యక్షుడి కిడ్నాప్‌పై మోదీ మౌనాన్ని ప్రశ్నించిన పాల్**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేస్తూ శాపనార్థాలు పెట్టారు. "పవన్ కల్యాణ్ జాగ్రత్త. నేను ఒక్క ప్రార్థన చేస్తే దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డిలా చనిపోతావు" అని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. నిన్న హైదరాబాద్, అమీర్‌పేటలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రముఖ గాయకుడు గద్దర్‌ది సహజ మరణం కాదని, ఆయన్ను చంపేశారని సంచలన ఆరోపణలు చేశారు. అలాగే వెనిజువెలా అధ్యక్షుడిని అమెరికా కిడ్నాప్ చేయిస్తే, ప్రధాని నరేంద్ర మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారని పాల్ ప్రశ్నించారు. తాను ప్రపంచ శాంతి కోసం ప్రార్థిస్తున్నానని, మూడో ప్రపంచ యుద్ధం జరగకుండా అమెరికాలో చర్చలు జరిపినట్లు తెలిపారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో రేవంత్ రెడ్డి సోదరుడికి సిట్ నోటీసులు

**తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో కొత్త పరిణామాలు**
**రేపు విచారణకు రావాలంటూ కొండల్ రెడ్డికి సిట్ నోటీసులు**
**బీఆర్ఎస్ హయాంలో కొండల్ రెడ్డి ఫోన్ ట్యాప్ చేసినట్టు దర్యాప్తులో తేలిన వైనం**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో కొత్త పరిణామాలు చోటు చేసుకున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత సోదరుడు కొండల్ రెడ్డికి స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) నోటీసులు పంపింది. రేపు ఉదయం 11 గంటలకు విచారణకు రావాలని ఆ నోటీసులో అధికారులు పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి విపక్ష నాయకుడిగా ఉన్న రోజుల్లో కొండల్ రెడ్డి ఫోన్‌ను ట్యాప్ చేశారని దర్యాప్తులో తేలింది. ఈ నేపథ్యంలో ఆయన వాంగ్మూలం తీసుకోవడం కోసం విచారణకు పిలుస్తున్నారు. ఇదే కేసులో మరో ఇద్దరు బీఆర్ఎస్ నేతలకూ నోటీసులు వెళ్లాయి. మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, చిరుమర్తి లింగయ్యలను కూడా రేపు ఉదయం 11 గంటలకు హాజరు కావాలని పోలీసులు ఆదేశించారు. ఇప్పటికే బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్ రావు తండ్రి కొండలరావు, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కుమారుడు సందీప్ రావులకు కూడా ఇలాంటి నోటీసులు జారీ అయ్యాయి.

# రూ.50,000 లంచం తీసుకుంటూ..

**ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ తహసీల్దార్**
**కామారెడ్డి జిల్లాలో లంచం తీసుకుంటూ పట్టుబడ్డ తహసీల్దార్**
**భూమి బదిలీ రిపోర్ట్ కోసం రూ.50 వేలు డిమాండ్**
**ప్రైవేట్ వ్యక్తి ద్వారా లంచం స్వీకరిస్తూ ఏసీబీకి చిక్కిన వైనం**
**తహసీల్దార్, మధ్యవర్తిని అరెస్ట్ చేసిన అధికారులు**
**లంచం అడిగితే 1064కి కాల్ చేయాలని ఏసీబీ సూచన**

కామారెడ్డి, జై భీమ్ న్యూస్

కామారెడ్డి జిల్లాలో ఓ తహసీల్దార్ లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. నాగిరెడ్డిపేట మండల తహసీల్దార్ యార్లగడ్డ శ్రీనివాసరావు, ఓ ప్రైవేట్ వ్యక్తితో కలిసి రూ.50,000 లంచం స్వీకరిస్తుండగా మంగళవారం ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే.. ఒక వ్యక్తి తన తండ్రి పేరు మీద ఉన్న వ్యవసాయ భూమిని తన పేరు మీదకు మార్చుకోవడానికి దరఖాస్తు చేసుకున్నాడు. ఈ ప్రక్రియలో అనుకూలంగా నివేదిక పంపేందుకు తహసీల్దార్ శ్రీనివాసరావు రూ.50,000 లంచం డిమాండ్ చేశాడు. ఈ మొత్తాన్ని చిన్నూరి అజయ్ అనే ప్రైవేట్ వ్యక్తి ద్వారా తనకు అందజేయాలని సూచించాడు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. ఫిర్యాదు స్వీకరించిన ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో వల పన్నారు. బాధితుడు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో అజయ్ ద్వారా డబ్బులు అందజేస్తుండగా అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రసాయనం పూసిన నోట్లను స్వాధీనం చేసుకుని, వారి చేతులను పరీక్షించగా పాజిటివ్ రిజల్ట్ వచ్చింది. దీంతో తహసీల్దార్ శ్రీనివాసరావుతో పాటు మధ్యవర్తిగా వ్యవహరించిన అజయ్‌ను కూడా ఏసీబీ అరెస్ట్ చేసింది. అనంతరం ఇద్దరినీ హైదరాబాద్‌లోని నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచారు. అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే తమ టోల్ ఫ్రీ నెంబర్ 1064కు లేదా వాట్సాప్ (9440446106), ఇతర సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా సమాచారం ఇవ్వాలని ఏసీబీ ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేసింది.

# డ్రగ్స్ పార్టీపై పోలీసుల దాడి

## పట్టుబడ్డ వారిలో ఎఆర్ కానిస్టేబుల్


హైదరాబాద్,జనవరి7(జై భీమ్ న్యూస్):

గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రగ్స్ పార్టీ జరుగుతుందన్న పక్కా సమాచారంతో ఈగల్ టీమ్ సోదాలు నిర్వహించింది. కొండాపూర్ మసీద్‌బండ సమీపంలో ఉన్న కోవే స్టేస్‌లో కొందరు వ్యక్తులు డ్రగ్స్ తీసుకుంటున్నట్లు తెలియడంతో ఈగల్ టీమ్ ఆకస్మిక దాడి చేసింది. సోదాల సమయంలో.. అక్కడ మద్యం సేవిస్తున్న ఏడుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారికి డ్రగ్ కిట్స్ ద్వారా పరీక్షలు నిర్వహించగా.. ఏడుగురిలో ఐదుగురికి గంజాయి పాజిటివ్ వచ్చింది. వీరిలో హైదరాబాద్‌కు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ కూడా ఉండటం గమనార్హం. పట్టుబడిన వారిలో నలుగురు స్నేహితులు ఉన్నారు. వారంతా 2019లో హోటల్ మేనేజ్‌మెంట్ పూర్తి చేశారు. గతంలో ఓ స్నేహితుడి పెళ్లి వేడుకకు వెళ్లిన సమయంలో వీరు మొదటిసారి డ్రగ్స్ రుచి చూశారు. ఆ సరదా.. కాలక్రమేణా వ్యసనంగా మారింది. అప్పటి నుంచి ఈ నలుగురూ తరచూ ఒకచోట చేరి డ్రగ్స్ సేవించడం అలవాటుగా మార్చుకున్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. వారికి డ్రగ్స్ ఎక్కడి నుంచి సరఫరా అవుతుందనే కోణంలో విచారణ వేగవంతం చేశారు.

# భూ "భారతి" బాధలు

మొదటి పేజీ తరువాయి

తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.న్యాయస్థానాలను ధిక్కరిస్తూ రెవెన్యూ పరిధిలో కబ్జా భూములకు పాసుబుక్కులు మంజూరు చేయబడ్డాక సామాన్యుల భూ హక్కులు ఎలా రక్షించబడతాయని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.భూభారతి చట్టం ప్రారంభించి తదుపరి గాలికి వదిలేసారని తీవ్రంగా విమర్శించారు.రాష్ట్ర విభజన చట్టంలోని తెలంగాణ విస్తీర్ణానికి చీఫ్ కమిషనర్ సర్వే ల్యాండ్ రికార్డ్స్ కార్యాలయంలో 1954 నుండి భూ రికార్డులైన మ్యాపులు సేత్వార్,సప్లమెంటరీ సేత్వార్, గ్రామ నక్షలు వసూల్ బాకీ పకడ్బందీగా పొందుపరచబడి ఉండగా ప్రస్తుతం 400 పైచిలుకు గ్రామాలకు గ్రామ నక్ష లేవని రికార్డులు లేవని మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటిస్తుండడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా చెరువులను పరిరక్షించడానికి భూ భారతి చట్టం చేపట్టబోయే కఠినమైన చర్యలు ఏమిటో ప్రజలకు ఇప్పటికీ స్పష్టంగా అర్థం కావడం లేదన్నారు.లెక్కలేనని చెరువులు కబ్జాలు చేయబడ్డాయని ఇండ్ల నిర్మాణాలు చేయబడ్డాయని వాటి వల్ల తెలంగాణ రాష్ట్ర భూమి ఉనికి పతనమైపోయిందన్నారు. భూభారతి చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించే విషయంలో రెవెన్యూ శాఖ ఉన్నత అధికారులు రెవెన్యూ శాఖ మంత్రి సరియైన క్లారిటీని ఇవ్వలేకపోతున్నారన్నారు.నేటి వరకు అన్ని ఎమ్మార్వో కార్యాలయాలు ధరణి చట్టం ఆధారంతో రిజిస్ట్రేషన్ జరుగుతున్నాయని అలాంటప్పుడు భూభారతి చట్టంలోని నియమాలకు చట్టబద్ధత ఎలా వస్తుందన్నారు.ఎమ్మార్వో కార్యాలయాలను అడ్డం పెట్టుకొని వ్యవసాయ భూములకు ప్రభుత్వ భూములకు, చెరువులకు,అసైన్డ్ భూములకు,నాలా కన్వర్షన్ల పేర్లతో తప్పుడు సర్వే నివేదికల ఏర్పాటు చేసుకొని లేఅవుట్లు చేస్తూ భూముల వ్యాపారం జరుగుతుండగా భూ భారతి చట్టం తెలంగాణ ప్రభుత్వ భూములను ఏ విధంగా రక్షిస్తుందంటూ సూటిగా అడిగారు.పాస్ పుస్తకాలు నిలుపుదల చేశామని ప్రభుత్వం తరఫున మంత్రి ప్రకటిస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడ్డాక ఎన్ని లక్షల ఎకరాలు కబ్జాలు చేయబడ్డాయో ప్రతి ఎమ్మార్వో కార్యాలయంలో గ్రామ రికార్డుల ఆధారాలను పరిశీలిస్తే స్పష్టంగా వెల్లడవుతుందన్నారు.పేదల భూములను కబ్జాలు చేయడం కోసం భూ కబ్జాదారులు రాజకీయ నాయకుల అండదండలను ,సహకారాలను ఉపయోగించుకుంటున్నారని అలాంటి వాళ్లకు మాత్రమే భూ భారతి చట్టం ఉపయోగకరంగా రక్షణ కరంగా




ఉండబోతున్నట్లు రైతులు ప్రజలు భావిస్తున్నారు.భూభారత్ చట్టంలోని లోపాల అభియోగాలు రాష్ట్ర వ్యాప్తంగా మారిమోగిపోతున్నాయన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మొదటి మూడు దఫల రైతు భరోసాను పాత రికార్డుల ఆధారంగా మంజూరు చేసినప్పుడు ధరణి చట్టం ద్వారా మంజూరు చేయబడ్డ పాసుబుక్కులు సర్వం తప్పులు ఉన్నాయని నిర్ధారణకు వచ్చినప్పుడు అలాంటి భూములకు రైతు భరోసా కల్పించి తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం సహకరించినట్లు లక్షల కోలది ఆధారాలు లేవా అంటూ ప్రశ్నించారు.హద్దులు లేని సదా పేపర్లకు పాసుబుక్కులు మంజూరు చేయడం సుప్రీంకోర్టు నియమాలకు విరుద్ధమని తెలిసినప్పటికిని దున్నినోనిదే భూమనే సిద్ధాంతాలను కబ్జాల రూపంలో కొనసాగిస్తుండగా వాటి సంగతేందంటూ సూటిగా అడిగారు.సాధారణ భూమి నుండి మొదలుకొని ప్రధాన భూముల వరకు కబ్జా మోఖాకు సరియైన ఆధారాలు లేని భూముల సంగతేందంటూ వాటిపై ప్రభుత్వం నుండి స్పష్టత రావాలన్నారు.తప్పుడు ఆధారాలను సృష్టించుకుని కబ్జాలు చేయబడుతున్న భూముల వివరాలను ఎమ్మార్వో కార్యాలయాలలో నమోదు చేయించాలన్నారు.పేదల భూములను కబ్జాలు చేసిన సంఖ్య లెక్కించడానికి వీలు లేకుండా పోతుందన్నారు.ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో 1954 నుండి భూ రికార్డులు ఉన్నాయా మాయమయ్యాయా అంటూ వాటి ఆనవాళ్లను లేకుండా చేస్తూ తప్పుడు పహాని రికార్డులను సృష్టించుకుని సంవత్సరాల కాలం పాటుగా భూకబ్జాలు చేస్తున్న వాళ్ల పరిస్థితి ఏంటంటూ వాళ్ళ చెర నుండి సామాన్ల భూములను భూ భారతి చట్టం ఏ విధంగా రక్షిస్తుందో మంత్రి తెలుపాలన్నారు.భూభారతి చట్టం ద్వారా ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా విడుదల చేసిన పాసుబుక్కుల సంఖ్యను తెలుపండి అంటూ గుర్తు చేశారు.భూభారతి చట్టం చట్టబద్ధత కల్పిస్తున్నప్పుడు రిజిస్ట్రేషన్ కార్యాలయాలలో ధరణి చట్టం పేరున మంజూరు చేయబడ్డ పాసుబుక్కులకు విచ్చలవిడిగా రిజిస్ట్రేషన్ ఎలా జరుగుతున్నాయని సూటిగా అడిగారు.వాటితోపాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో పొందుకున్న పాత పాసుబుక్కులను ఉపయోగిస్తూ ధరణి చట్టం నిర్మితమయ్యాక కూడా వాటి నియమాలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అన్ని రకాల భూములకు రిజిస్ట్రేషన్ ఏ విధంగా చేయబడుతున్నాయన్నారు.కౌలు రైతులను ఆదుకుంటామని చెప్పిన ప్రభుత్వం ఉత్తమటేనా అంటూ సూటిగా నిలదీశారు.రాష్ట్రం ఏర్పడి 79 సంవత్సరాలు అవుతుండగా తెలంగాణ రాష్ట్రం 1954లో రివిజన్ సర్వే నిర్వహించబడిందని దాని ఆధారంగానే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నిర్మాణం దాల్చిన సంగతిని మర్చిపోతూ భూ రికార్డులను శుద్ధిపరుస్తామని ఒకరు సర్వే నెంబర్ల ప్రక్షాళన చేస్తామని మరొకరు భూ సమస్యల కు శాశ్వత పరిష్కార మార్గాలను కల్పిస్తామని ప్రస్తుత నాయకులు ఎవరికి తోచిన విధంగా వాళ్ళు మాట్లాడుతున్నారు తప్ప తెలంగాణ రాష్ట్రంలో విచ్చలవిడిగా పెరిగిపోతున్న భూకబ్జాలను మాత్రం నిలువరించలేకపోతున్నారన్నారు. రాష్ట్ర ప్రజల్ని మభ్యపెడుతున్నారే తప్ప భూ సమస్యల పట్ల శాశ్వత పరిష్కారం మార్గాలను చూపించలేకపోతు న్నారని దానివల్ల తెలంగాణ రాష్ట్రంలో భూకబ్జాల నిలుదోపిడి విచ్చలవిడిగా పెరిగిపోతుందని తీవ్రంగా మండిపడ్డారు.సాధారణ ప్రజల భూములకు న్యాయస్థానాల వరకు వెళ్లకుండా రక్షణ కల్పించినప్పుడే ప్రభుత్వానికైతేనేమి ప్రభుత్వ యంత్రాంగాలకైతేనేమి మంత్రుల క్రితేనేమి ముఖ్యమంత్రి కైతేనేమి గౌరవం దక్కుతుందని లేనియెడల ధరణి చట్టం విధ్వంసం సృష్టించిందని తెలుపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు కొనసాగించబడుతున్న భూభారతి చట్టం కూడా లెక్కకు మించిన భూకబ్జాల విధ్వంసాలను సృష్టిస్తుందని తెలంగాణ ప్రజలు ఎప్పుడో పసిగట్టారన్నారు.ప్రజలు మేల్కొనంతకాలం మేధావులు ప్రశ్నించనంత కాలం చట్టాలలో మార్పు రాదు ప్రభుత్వాల పాలనతో ప్రజలకు మేలు జరగదనేది స్పష్టంగా వెల్లడైపోతుందన్నారు.చట్ట సవరణ ద్వారా రూపొందించబడుతున్న చట్టాలన్నీ ధనికుల కోసమే పనిచేసే విధంగా ఉన్నాయంటూ బాధ వ్యక్తం చేశారు.పేద ప్రజల ఆత్మగౌరవం కోసం పనిచేస్తూ నిజాయితీని చాటండి అంటూ గుర్తు చేశారు.

# భార్య వంట చేయట్లేదని విడాకులు కావాలంటూ భర్త పిటిషన్..

**తెలంగాణ హైకోర్టు ఏం చెప్పిందంటే..!**
**భర్త పిటిషన్‌ను కొట్టివేసిన తెలంగాణ హైకోర్టు**
**ఉద్యోగం చేసే భార్య ఇంటిపని చేయకపోవడం క్రూరత్వం కాదని వ్యాఖ్య**
**బాధ్యతలను సమానంగా పంచుకోవాలని ధర్మాసనం హితవు**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

భార్య వంట చేయడం లేదనో, ఇంటి పనులు చక్కబెట్టడం లేదనో విడాకులు మంజూరు చేయలేమని తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. భార్యాభర్తలిద్దరూ ఉద్యోగస్థులైనప్పుడు, కేవలం వంట చేయలేదనే కారణాన్ని క్రూరత్వంగా పరిగణించలేమని స్పష్టం చేసింది. మారుతున్న సామాజిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ తీర్పు ఇస్తున్నట్లు జస్టిస్ మౌసమీ భట్టాచార్య, జస్టిస్ నగేశ్ భీమపాకలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. వివరాల్లోకి వెళితే... హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్‌కు చెందిన ఓ వ్యక్తి తన భార్య ఇంటి పనులు, వంట చేయకుండా, తన తల్లికి సాయపడకుండా మానసికంగా హింసిస్తోందని ఆరోపిస్తూ విడాకుల కోసం కోర్టును ఆశ్రయించాడు. కింది కోర్టులో పిటిషన్ తిరస్కరణకు గురవడంతో హైకోర్టులో అప్పీలు దాఖలు చేశాడు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం, దంపతులిద్దరి పనివేళలను పరిశీలించింది. భర్త మధ్యాహ్నం 1 నుంచి రాత్రి 10 గంటల వరకు, భార్య ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నట్లు గుర్తించింది. ఇద్దరూ ఉద్యోగాలు చేస్తున్నప్పుడు, ఇంటి పనుల విషయంలో ఆరోపణలు చేయడం సహేతుకం కాదని అభిప్రాయపడింది. అంతేకాకుండా గర్భస్రావం తర్వాత కోలుకోవడానికి భార్య పుట్టింటికి వెళ్లడాన్ని క్రూరత్వంగా భావించలేమని స్పష్టం చేసింది. భర్త ఆరోపణల్లో వైవాహిక బంధాన్ని రద్దు చేసేంత తీవ్రమైన కారణాలు లేవని తేల్చిచెప్పిన హైకోర్టు, అతని అప్పీలును కొట్టివేసింది. ఆధునిక కాలంలో బాధ్యతలను పాతకాలపు ధోరణులతో కాకుండా పరస్పర అవగాహనతో పంచుకోవాలని హితవు పలికింది.

# తప్పించుకున్న దొంగ పట్టివేత

నాగర్‌కర్నూల్,జనవరి7(జై భీమ్ న్యూస్):

కల్వకుర్తి పీఎస్ నుంచి పరారైన కరడుకట్టిన అంతర్రాష్ట్ర దొంగను ఎట్టకేలకు సీసీఎస్ పోలీసులు పట్టుకున్నారు. పోలీస్ వర్గాల నుంచి తెలిసిన విశ్వసనీయ సమాచారం మేరకు తెలుగు నాగిరెడ్డి అలియాస్ మ్లలెపూల నాగిరెడ్డిది నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం వీరాపూర్ గ్రామం. పలు చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. కల్వకుర్తి పరిధి పీఎస్‌లోనూ కేసులు ఉన్నాయి. అనంతపురం జిల్లా జైలులో ఉన్న నాగిరెడ్డిని గత ఏడాది నవంబర్ 11న కల్వకుర్తి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచి కల్వకుర్తికి తీసుకొచ్చి విచారించారు. అదే నెల 13న రాత్రి పోలీసుల కళ్లుగప్పి మరుగుదొడ్డి కిటికీలోంచి చాకచక్యంగా పరారయ్యాడు. అతడి కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చేపట్టినా ఫలితం లేపోయింది. మేడ్చల్ సీసీఎస్ పోలీసులు మంగళవారం రాత్రి నాగిరెడ్డిని అరెస్ట్ చేసినట్లు తెలిసింది.

# నిర్మాణ కూలీలు లక్ష్యంగా డ్రగ్స్ విక్రయం

**పక్కా సమాచారంతో పోలీసుల దాడి**

హైదరాబాద్,జనవరి7(జై భీమ్ న్యూస్):

కొంపల్లి పేట్‌బషీరాబాద్ వద్ద నిర్మాణ రంగం, ఇంటీరియర్ డిజైనింగ్ పనుల కోసం రాజస్థాన్ నుండి వలస వచ్చిన కళాకారులే లక్ష్యంగా సాగుతున్న భారీ మాదకద్రవ్యాల దందాను సైబరాబాద్ పోలీసులు గుట్టురట్టు చేశారు. పాన్ మసాలాల్లో మత్తు మందులు కలుపుకుని సేవించడమే కాకుండా, వాటిని అక్రమంగా విక్రయిస్తున్న అంతర్రాష్ట్ర ముఠా గుట్టును పేట్‌బషీరాబాద్ పోలీసులు మరియు ఈగల్ ఫోర్స్ ఛేదించింది. ÷రిళిలీసుల కథనం ప్రకారం.. రాజస్థాన్ మరియు ఇతర ఉత్తరాది రాష్ట్రాల నుండి జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వలస వచ్చిన చాలా మంది కళాకారులు మాదకద్రవ్యాలకు అలవాటు పడ్డారు. వీరు ఎండీఎంఏ, నల్లమందు క్షూతిబీప) వంటి ప్రమాదకరమైన మత్తు పదార్థాలను పాన్ మసాలాలలో కలుపుకుని సేవించడం పరిపాటిగా మారింది. సొంత ఊర్లకు వెళ్లి తిరిగి వచ్చేటప్పుడు తమతో పాటు భారీ మొత్తంలో ఈ డ్రగ్స్‌ను తీసుకువచ్చి, తోటి రాజస్థానీ కార్మికులకు విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ వ్యవహారం జరుగుతున్నట్లు పక్కా సమాచారం అందుకున్న ఈగల్ ఫోర్స్, స్థానిక పోలీసులను అప్రమత్తం చేసింది. గత ఒక నెల రోజులుగా నిఘా బృందాలు క్షేత్రస్థాయిలో పకడ్బందీగా పర్యవేక్షించాయి. ఈ సంయుక్త ఆపరేషన్‌లో కీలక నిందితుడు పట్టుబడ్డాడు. ÷ూజస్థాన్ నుండి డ్రగ్స్ తెచ్చి విక్రయిస్తున్న రాజేందర్ అరాజు భాకర్ (31) అనే ఇంటీరియర్ డిజైనర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుండి నల్లమందును స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ మార్కెట్లో సుమారు రూ. 15 లక్షలు ఉంటుందని అంచనా.నిందితుడు రాజేందర్ 8వ తరగతి మధ్యలోనే మానేసి హైదరాబాద్ వచ్చి కార్పెంటర్, ఇంటీరియర్ డిజైనర్‌గా స్థిరపడ్డాడు. మత్తుకు బానిసైన ఇతను, ఇక్కడ డిమాండ్ పెరగడాన్ని గమనించి.. రాజస్థాన్‌లోని నాగౌర్ జిల్లాకు చెందిన సప్లయర్లు ధన్‌రాజ్, అనిల్, ముఖేష్‌ల నుంచి డ్రగ్స్ సేకరించి నగరానికి తెచ్చేవాడు. ఇక్కడ గ్రాముకు రూ. 5000 చొప్పున విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. ?ప్రస్తుతం ప్రధాన సప్లయర్లు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అలాగే ఈ డ్రగ్స్ కొనుగోలు చేస్తున్న పలువురు వినియోగదారులను కూడా పోలీసులు గుర్తించారు.



# శాంతి భద్రతల పరిరక్షణలో సాయుధ పోలీసుల పనితీరు అభినందనీయం





**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**

**వరంగల్, జనవరి 7, 2026 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నేరాల నియంత్రణతో పాటు శాంతి భద్రతల పరిరక్షణలో సాయుధ పోలీసుల పనితీరు ఎంతో అభినందనీయమని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం వరంగల్ పోలీస్ కమిషనర్ సిటీ ఆర్మ్ రిజర్వ్ విభాగాన్ని తనిఖీ చేశారు. ఉదయం పోలీస్ పరేడ్ మైదానానికి చేరుకున్న కమిషనర్‌కు ఆర్మ్ రిజర్వ్ పోలీస్ అధికారులు పుష్పగుచ్చాలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం సాయుధ పోలీసులు నిర్వహించిన పోలీస్ పరేడ్‌ను ఆయన తిలకించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందికి ఆయుధాలపై ఉన్న పరిజ్ఞానం, వాటిని వినియోగించే విధానాలు, ఆయుధ పరేడ్, వ్యాయామం, యోగా తదితర అంశాలను కమిషనర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఆయా విభాగాల్లో ప్రతిభ కనబరిచిన సిబ్బందికి క్షేత్ర స్థాయిలోనే రివార్డులను ప్రకటించి ప్రోత్సహించారు. అదేవిధంగా డాగ్ స్క్వాడ్, బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, మోటార్ విభాగం, ఆయుధగారం విభాగాల పనితీరును కూడా పరిశీలించి, సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ తనిఖీల్లో భాగంగా ఆకట్టుకున్న రుద్రమ ఉమెన్స్ స్పెషల్ పోలీస్ ఫోర్స్ విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఏర్పాటైన అనంతరం, పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు తొలిసారిగా ఈ ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో పనిచేస్తున్న మహిళా పోలీసులు పురుషులకు సమానంగా కమాండో తరహా శిక్షణ పూర్తి చేసి, దేహదారుఢ్య శిక్షణతో పాటు ఆయుధ శిక్షణలోనూ విశేష ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా మహిళా సిబ్బంది కళ్లకు గంతలు కట్టుకుని ఆయుధాలను విడదీయడం, తిరిగి వాటిని అమర్చడం వంటి విన్యాసాలను ప్రదర్శించగా, పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా తిలకించి ప్రశంసలతో పాటు రివార్డులను ప్రకటించారు. తనిఖీల అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, అధికారులు మరియు సిబ్బంది అప్పగించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని, శాఖాపరంగా ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపిలు సురేష్‌కుమార్, శ్రీనివాస్, రవి, ట్రైనీ ఐపీఎస్ మనిషా నేహ్రా, ఏసీపిలు నాగయ్య, సురేంద్ర, ఆర్.ఐలు స్పర్జన్ రాజ్, సతీష్, శ్రీధర్, చంద్రశేఖర్‌తో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 2026 రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా తల్లిదండ్రులకు, సమాజానికి విజ్ఞప్తి

**ఒక ప్రమాదం మనందరికీ పాఠం కావాలి**
**హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీతా రెడ్డి**

**హన్మకొండ, 7 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

రోడ్డు ప్రమాదాలు ఒక్క క్షణంలో వందల కుటుంబాల జీవితాలను ఛిద్రం చేస్తున్నాయని, తల్లిదండ్రులు, సమాజంలోని ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత విషయంలో బాధ్యతగా వ్యవహరించాలని సీతా రెడ్డి పిలుపునిచ్చారు. 2026 రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా అయన ఈ విజ్ఞప్తిని విడుదల చేశారు. ఇటీవల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల జరిగిన ప్రమాదాల్లో 43 మంది ప్రాణాలు కోల్పోయారని, ఆ ఒక్క నిర్లక్ష్యం వెనుక 43 కుటుంబాలు కన్నీట మునిగిపోయాయని గుర్తు చేశారు. ఒక్క తప్పు అడుగు ఎలా మొత్తం జీవితాన్ని మార్చేస్తుందో ఈ సంఘటనలు స్పష్టంగా చెబుతున్నాయని పేర్కొన్నారు. ఈ ప్రమాదాల నేపథ్యంలో బస్ డ్రైవర్, క్లీనర్, లారీ యజమాని, డ్రైవర్ జైలు పాలయ్యారని, ట్రావెల్స్ యాజమాన్య కార్యాలయాలు మూసివేయబడటంతో వందల మంది ఉద్యోగాలు కోల్పోయారని వివరించారు. మొత్తంగా దాదాపు 500 కుటుంబాలు ఆర్థికంగా, మానసికంగా తీవ్రంగా నష్టపోయాయని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల సమయంలో తాను గమనించిన మరో కీలక అంశాన్ని ఆమె వెల్లడిస్తూ, చాలా మంది భర్తలు మద్యం సేవించి భార్య, పిల్లలతో కలిసి వాహనం నడుపుతూ పట్టుబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రవర్తనను పిల్లలు గమనిస్తారని, పిల్లలను సన్మార్గంలో నడిపించాలంటే ముందు తల్లిదండ్రులే ఆదర్శంగా ఉండాలని స్పష్టం చేశారు. “నా పిల్లాడు అలాంటివాడు కాదు” అనే భావనను మించి, పిల్లలకు జాగ్రత్తగా ఉండే అలవాట్లు చిన్ననాటి నుంచే నేర్పించాలని సూచించారు. కుటుంబాన్ని నడిపించే వ్యక్తి ప్రమాదానికి గురై మంచానికి పరిమితమైనా లేదా మరణించినా, ఆ కుటుంబం ఆర్థికంగా, సామాజికంగా కొన్ని తరాలు వెనుకబడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. నేటి పరిస్థితుల్లో తల్లితండ్రి ఇద్దరూ ఉన్నప్పుడే పిల్లలను పెంచడం కష్టంగా ఉందని, ప్రమాదంలో తండ్రిని కోల్పోతే ఆ కుటుంబం పడే బాధలు వర్ణనాతీతమని తెలిపారు. చివరిగా, రాత్రి 10 గంటల తర్వాత పిల్లలు ఎక్కడ ఉన్నారో తల్లిదండ్రులు తప్పనిసరిగా గమనించాలి, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, అలా చేస్తే తమకే కాదు ఇతరులకు కూడా ప్రాణాపాయం కలుగుతుందని విజ్ఞప్తి చేశారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, నిబంధనలు పాటిస్తేనే ప్రాణాలను కాపాడగలమని హనుమకొండ ట్రాఫిక్ పోలీస్ తరపున కోరారు.



# అంబాల జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో ఉపాధ్యాయులకు ఆత్మీయ వీడ్కోలు

**విద్యా వ్యవస్థపై విద్యార్థులకు దిశానిర్దేశం చేసిన పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు**
**విద్యార్థుల ప్రేమాభిమానాలతో భావోద్వేగంగా ముగిసిన కార్యక్రమం**

**హన్మకొండ, 7 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

కమలాపూర్ మండలం అంబాల గ్రామ జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదోన్నతిపై వెళ్లిన ఉపాధ్యాయులకు నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమం ఆత్మీయతతో, ఆలోచనాత్మక వాతావరణంలో సాగింది. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ఉపాధ్యాయుల సేవలను స్మరించుకుంటూ కృతజ్ఞతాభావం వ్యక్తం చేయగా, పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు విద్యా వ్యవస్థ, విద్యార్థుల భవిష్యత్తుపై విలువైన సూచనలు చేస్తూ దిశానిర్దేశం చేశారు. విద్యార్థులు మాట్లాడుతూ, హిందీని సులభంగా అర్థమయ్యేలా బోధించి చదువుతో పాటు సంస్కార విలువలను నేర్పిన పొంది మేడం సేవలను ప్రత్యేకంగా గుర్తు చేశారు. విద్యార్థి పాఠశాలకు రాకపోతే తల్లిదండ్రులను సంప్రదించి కారణాలు తెలుసుకునేంత శ్రద్ధ ఆమె చూపించారని తెలిపారు. అలాగే గణితాన్ని స్నేహపూర్వకంగా, స్పష్టంగా బోధించి గణితం అంటే ఇష్టం కలిగించిన శివశంకర్ సార్ విధానాన్ని కొనియాడారు. సామాజిక శాస్త్ర ఉపాధ్యాయులు కర్ణాకర్ సార్ గ్లోబ్‌లు, చార్ట్‌లు, చిత్రపటాల ద్వారా పాఠాలను జీవంతంగా వివరించారని పేర్కొన్నారు. సైన్స్‌ను సులభంగా, ఆసక్తికరంగా బోధించిన జ్ఞాన ప్రసూన మేడం సేవలు కూడా



విద్యార్థుల ప్రశంసలు అందుకున్నాయి. ఈ సందర్భంగా మాట్లాడిన పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు, విద్య అనేది కేవలం మార్కుల కోసం మాత్రమే కాకుండా వ్యక్తిత్వ వికాసానికి పునాదిగా ఉండాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని, అదే సమయంలో క్రమశిక్షణ, నైతిక విలువలు, సమాజ పట్ల బాధ్యతను మరచిపోకూడదని హితవు పలికారు. ఉపాధ్యాయులువిద్యార్థుల మధ్య బంధమే విద్యా వ్యవస్థకు బలమైన పునాది అని, పాఠశాలే విద్యార్థులకు తొలి ప్రపంచమని పేర్కొన్నారు. పోటీ ఎక్కువైన ప్రస్తుత పరిస్థితుల్లో ఒత్తిడికి లోనుకాకుండా లక్ష్యాన్ని స్పష్టంగా నిర్ధారించుకుని ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రోజా రాణి, ఉపాధ్యాయులు సంపత్ నరసింహారెడ్డి, రజిత భారతి, అంజు, శ్రీలత, స్వరూప, లక్ష్మి, శ్రీనివాస్, రహమద్ పాల్గొన్నారు. పాఠశాల యాజమాన్యం తరపున పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మెట్టుపల్లి రితిక, పోలేపాక మీనా, మోహిన్, లక్కీ, యాస్మిన్, బి. అక్షిత, రజియా బేగం, ఉడుతనబోయిన వర్షితలు డాన్స్‌లతో అలరించగా, రాహుల్, శివ, మోహిన్, చిన్నిలు చేసిన ప్రసంగాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అలాగే సెల్ఫ్ గవర్నమెంట్ డే సందర్భంగా ఉపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వహించిన చిన్ని, వైష్ణవి, వర్షిత, చరణ్, ప్రణయ్, కౌశిక్, అఖిల్, రమణ, అభినవ్, రాహుల్, వెంకటేష్, ఆసిఫ్ విద్యార్థులు ప్రత్యేక ప్రశంసలు పొందారు. మొత్తంగా ఈ వీడ్కోలు కార్యక్రమం విద్యార్థుల ప్రేమాభిమానాలు, ఉపాధ్యాయుల అనుభవజ్ఞానం, విద్యా వ్యవస్థపై విలువైన సందేశాలతో ఆత్మీయతతో నిండిన వాతావరణంలో ముగిసింది.



## కేయూ హాస్టల్ అవినీతి అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరిపించాలి : ఎస్ఎఫ్ఐ





**వరంగల్, 7 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ యూనివర్సిటీలోని హాస్టల్ కార్యాలయంలో చోటుచేసుకున్న అవినీతి అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరిపించాలని స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) డిమాండ్ చేసింది. ఎస్ఎఫ్ఐ కాకతీయ యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం యూనివర్సిటీ గెస్ట్ హౌస్‌లో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ అధ్యక్షకార్యదర్శులు చెన్నూరు సాయికుమార్, బీరెడ్డి జస్వంత్ మాట్లాడుతూ యూనివర్సిటీలో అవినీతి దందా రోజురోజుకు పెరుగుతోందని ఆరోపించారు. హాస్టల్ ఆఫీసులో జరిగిన అక్రమాలపై విద్యార్థులు, విద్యార్థి సంఘాలు ఫిర్యాదు చేయడంతో విచారణ కమిటీ ఏర్పాటు చేసినప్పటికీ, తాజాగా అక్కడి కీలక కంప్యూటర్ విద్యుత్ షాక్‌తో కాలిపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని తెలిపారు. ప్రతిరోజూ ఉపయోగించే కంప్యూటర్ అకస్మాత్తుగా కాలిపోవడం వెనుక డేటా ధ్వంసానికి సంబంధించిన కుట్ర ఉండొచ్చని ఎస్ఎఫ్ఐ నేతలు అనుమానం వ్యక్తం చేశారు. వెంటనే కాలిపోయిన కంప్యూటర్‌లోని డేటాను ఫోరెన్సిక్ పద్ధతుల్లో రికవరీ చేసి, ఈ ఘటనకు బాధ్యులైన వారిపై నిష్పక్షపాత విచారణ జరపాలని వారు డిమాండ్ చేశారు. అలాగే, ఈ ఘటనకు కారణమని ఆరోపణలు ఎదుర్కొంటున్న నవీన్ను తక్షణమే విధుల నుంచి శాశ్వతంగా తొలగించాలని, అతడిని రక్షించిన అధికారుల పాత్రపై కూడా విచారణ జరిపి అవినీతికి పాల్పడ్డ ప్రతి ఒక్కరిపై కఠిన చర్యలు తీసుకోవాలని యూనివర్సిటీ యాజమాన్యాన్ని, ఉన్నత విద్యాశాఖను, విజిలెన్స్ మరియు యాంటీ కరప్షన్ బ్యూరో తెలంగాణ అధికారులను కోరారు. ఈ ప్రెస్ మీట్‌లో ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ కమిటీ సభ్యులు మల్లేష్, పవన్, సాయి, రాహుల్ పాల్గొన్నారు.

## ఏసీబీ వలలో దేవాదాయశాఖ అధికారి

**హైద్రాబాద్, 7 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**



యాంటీ కరప్షన్ బ్యూరో తెలంగాణ అధికారులు నిర్వహించిన వలపాటులో దేవాదాయశాఖకు చెందిన ఓ అధికారి లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. హైదరాబాద్‌లోని బార్‌అంబర్‌పేట ప్రాంతంలో దేవాదాయశాఖ భూమి వ్యవహారానికి సంబంధించిన కేసులో ఈ ఘటన చోటుచేసుకుంది. దేవాదాయశాఖలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న కిరణ్ కుమార్ ఓ భూమి విషయంలో అనుకూలంగా వ్యవహరించేందుకు బాధితుడి నుంచి రూ.50 వేల లంచం డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని బాధితుడు ఏసీబీ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో, వారు ముందస్తు ప్రణాళికతో వలపాటు నిర్వహించారు. బుధవారం కిరణ్ కుమార్ లంచం తీసుకుంటున్న సమయంలో ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం ఆయన కార్యాలయం, నివాసంలో కూడా ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. ఈ కేసుకు సంబంధించిన మరిన్ని వివరాలను అధికారులు సేకరిస్తుండగా, లంచం వ్యవహారంలో మరెవరైనా పాత్ర ఉందా అనే కోణంలోనూ విచారణ కొనసాగుతోంది.

## ప్రేమ పేరుతో మైనర్ బాలికపై అత్యాచారం

**కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు**

**విజయవాడ,జనవరి7(జై భీమ్ న్యూస్) :**

జిల్లాలోని చందర్లపాడు మండలం విపరింతలపాడులో ఒక మైనర్ బాలికపై అత్యాచారం జరిగింది. ప్రేమ పేరుతో అదే గ్రామానికి చెందిన జాషువా(21) అనే యువకుడు బాలికను మోసం చేశాడు. 14 ఏళ్ల మైనర్ బాలిక.. పక్క గ్రామంలో ప్రభుత్వ వసతీ గృహంలో ఉంటూ జడ్పీహెచ్ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. క్రిస్మస్ పండుగ సందర్భంగా సెలవులకు స్వగ్రామానికి వచ్చింది. అదే గ్రామంలో ఉంటున్న జాషువా అనే యువకుడు బాలికను ప్రేమిస్తున్నానంటూ మాయమాటలు చెప్పి లొంగదీసుకున్నాడు. డిసెంబర్ 26న బాలిక ఇంట్లో ఎవరూ లేని సమయంలో చూసి అత్యాచారం చేశాడు. అనంతరం ఈ విషయం ఎవరికి చెప్పినా ఇద్దరు కలిసి దిగిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ చేస్తా అని బెదిరించాడు. బాలిక అనారోగ్యంగా ఉండటంతో ఆమె తల్లి ఏం జరిగిందని ప్రశ్నించగా అసలు విషయం చెప్పింది. తల్లిదండ్రులు గ్రామ పెద్దలను ఆశ్రయించగా అక్కడ రాజీ కుదరకపోవడంతో బుధవారం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని నిందితుడి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## పోలవరం 87శాతం పనులు పూర్తి

**అమరావతి,జనవరి7(జై భీమ్ న్యూస్):**

పోలవరం ప్రాజెక్టులో 87 శాతం సివిల్ పనులు పూర్తయ్యాయని.. గడువులోగా మిగిలిన పనులన్ని పూర్తి చేయాలని ఉన్నతాధికారులను సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఎడమ కాలువ పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులకు ఆయన సూచించారు. కుడి కాలువ ద్వారా కొల్లేరు ప్రాంతాలకు సైతం నీరు వెళ్లేలా చూడాలని ఉన్నతాధికారులకు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. బుధవారం పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ పనులను సీఎం చంద్రబాబు నాయుడు పరిశీలించారు. ఏరియల్ సర్వే చేశారు. ప్రాజెక్ట్ నిర్మాణ పనులపై ఉన్నతాధికారుల నుంచి ఆయన ఆరా తీశారు. అనంతరం ప్రాజెక్ట్ నిర్మాణంలో భాగంగా జరుగుతున్న పనులపై ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. నిర్వాసితుల పునరావాసంతోపాటు ఆర్ అండ్ ఆర్ పనులపై దృష్టి కేంద్రీకరించాలని ఉన్నతాధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. మే మొదటి వారంలో మళ్లీ పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ పనులను తనిఖీ చేస్తానని వారికి సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ సమీక్ష అనంతరం సీఎం చంద్రబాబు నాయుడు రాజమండ్రి నుంచి నేరుగా ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. రాత్రికి కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో చంద్రబాబు డిన్నర్ మీటింగ్ జరగనుంది. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలను అమిత్ షా దృష్టికి సీఎం తీసుకెళ్లనున్నారని తెలుస్తోంది. పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణాన్ని వేగవంతం చేయడంతోపాటు.. ఈ ప్రాజెక్ట్ నిర్మించడం వల్ల తమకు భవిష్యత్తులో ఇబ్బందులు కలుగుతాయంటూ పలు రాష్ట్రాలు ఇప్పటికే న్యాయ స్థానాలను ఆశ్రయించాయి.

# విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వం రావాలి : బీ.ఎస్. రాములు









**కాకతీయ విశ్వవిద్యాలయం గోల్డెన్ జూబిలీ ఉత్సవాల్లో 'తెలంగాణ చరిత్రలో ప్రజా ఉద్యమాలు (19692025)'పై ప్రత్యేక కార్యక్రమం**

**హన్మకొండ, 7 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయం గోల్డెన్ జూబిలీ ఉత్సవాల్లో భాగంగా డీన్ స్టూడెంట్ అఫైర్స్, తెలుగు విభాగం సంయుక్త ఆధ్వర్యంలో "తెలంగాణ చరిత్రలో ప్రజా ఉద్యమాలు (19692025)" అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా విచ్చేసిన బీ.ఎస్. రాములు, మాజీ బీసీ కమిషన్ చైర్మన్ మరియు సామాజిక తత్వవేత్త, విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వం పెరగాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రో. ప్రతాప్ రెడ్డి (కేయూ వైస్ ఛాన్సలర్), గౌరవ అతిథిగా ప్రో. వి. రామచంద్రం (కేయూ రిజిస్ట్రార్) హాజరయ్యారు. అలాగే విశిష్ట అతిథులుగా యూనివర్సిటీ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రో. టీ. మనోహర్, కేయూ పాలక మండలి సభ్యులు డా. చిర్ర రాజు, తెలుగు విభాగం అధిపతి డా. మామిడి లింగయ్య, డీన్ స్టూడెంట్ అఫైర్స్ ప్రో. మామిడాల ఇస్తారి పాల్గొన్నారు. ముఖ్య వక్త బీ.ఎస్. రాములు మాట్లాడుతూ, ప్రజా ఉద్యమాలు సామాజిక మార్పు కోసం జరిగే చైతన్యప్రదమైన ప్రక్రియలని, అవి ప్రజల అవసరాలు, ఆకాంక్షలను ప్రతిబింబించే వేదికలని వివరించారు. 1969 నుండి 2025 వరకు తెలంగాణలో జరిగిన ఉద్యమాలు ప్రజల ఆత్మగౌరవాన్ని, హక్కుల సాధనను, రాజకీయ చైతన్యాన్ని పెంపొందించాయని అన్నారు. విద్యార్థులు, కార్మికులు, రైతాంగం, బహుజన వర్గాలు ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించాయని, ఉద్యమాల ప్రభావంతో విద్య, ఉపాధి, భూమి, హక్కుల పరిరక్షణ వంటి రంగాల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయని వివరించారు. ఉద్యమాల చరిత్రను అధ్యయనంగా తీసుకోవడం ద్వారా యువతలో సామాజిక బాధ్యత పెరుగుతుందని, చైతన్యవంతమైన సమాజ నిర్మాణానికి ఇది దోహదపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్య అతిథిగా మాట్లాడిన ప్రో. ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమాల ప్రాధాన్యతను వివరించారు. "సమాజ హిత ఉద్యమాలను స్వాగతించాలి. అవి ప్రజల అవసరాల నుంచే పుట్టినవే. ఉద్యమాలు ప్రజల ఆకాంక్షలకు ప్రతినిధిగా నిలుస్తాయి. తెలంగాణ ఉద్యమాల గడ్డగా గుర్తింపు పొందిన ఈ ప్రాంతం, చైతన్యవంతమైన ప్రజల సంఘటిత పోరాటాల ద్వారా రాష్ట్రాన్ని సాధించింది" అని పేర్కొన్నారు. ఉద్యమాలు వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాక, సమాజ హితం కోసం సాగాలని ఆయన స్పష్టం చేశారు. ఉద్యమాల చరిత్రను అధ్యయనం చేయడం యువతను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం కేయూ సెనేట్ హాల్‌లో "తెలంగాణ చరిత్రలో ప్రజా ఉద్యమాలు" అనే అంశంపై వ్యాస రచన, ఉపన్యాస పోటీలు నిర్వహించగా, మొత్తం 288 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకుని ఉత్సాహంగా పాల్గొన్నారు. వ్యాస రచన పోటీల్లో మొదటి బహుమతి జే. ప్రియాంక, రెండవ బహుమతి పీ. చరణ్, బండి సాయిలక్ష్మి, తృతీయ బహుమతి బీ. ఊర్మిళ, రోబికా రాణిలకు లభించగా, ఉపన్యాస పోటీల్లో మొదటి బహుమతి జయశీల, రెండవ బహుమతి పొన్నం శృతి, వసంత, తృతీయ బహుమతి ఉమేష్, జ్యోతి, అశోక్ కుమార్‌లు సాధించారు. విజేతలకు బీ.ఎస్. రాములు, కేయూ వీసీ ప్రో. ప్రతాప్ రెడ్డి చేతుల మీదుగా సర్టిఫికెట్లు, పుస్తకాలు బహుమతులుగా అందజేశారు. వ్యాస రచన, ఉపన్యాస పోటీలకు న్యాయ నిర్ణేతలుగా డా. వాసిరెడ్డి కృష్ణారావు, డా. జరుపుల రమేష్, ఎస్. రజిత వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో యూత్ వెల్ఫేర్ ఆఫీసర్లు డా. నిరంజన్, డా. రాధిక, తెలుగు విభాగం అధ్యాపకులు డా. కర్రె సదాశివ, డా. బానోతు స్వామి సహా అధిక సంఖ్యలో పీజీ విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# దళిత యువకుడిని చంపుతామని బెదిరించిన అగ్రవర్ణ కుటుంబం

## పోలీస్ స్టేషన్లో కేసు నమోదు

## శ్రీకాంత్ రావణ్




**బెంగళూరు గ్రామంతర జిల్లా జై భీమ్ న్యూస్ :**

గత ఆదివారం రోజు బెంగళూరు గ్రామీణ జిల్లా హొసకోట్ తాలూకా సులిబెలే హోబ్లి భువనహల్లి గ్రామంలోని సర్వే నంబర్ 187లో భువనహల్లి గ్రామంలోని అగ్రవర్ణ కుటుంబానికి చెందిన అభిలాష్ ( రాజా హులి ) భూమిలోకి మద్యం తాగడానికి వెళ్ళినప్పుడు, ఆ భూమి యజమాని నాగరాజు, దానిని డి. శెట్టి హల్లి గ్రామం సాగర్ కు లీజుకు తీసుకున్నాడు, నాకు ఫోన్ చేసి, సోదరుడు, అభిలాష్ మేము వ్యవసాయం చేస్తున్న భూమిలో మద్యం తాగుతూ మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నాడు. అప్పుడు, నేను అతనిని నాకు సహాయం చేయమని అడిగినప్పుడు, రవి అనే దళిత యువకుడు అభిలాష్ అతనికి ఫోన్ చేసి అడిగినప్పుడు, అభిలాష్ ఆ దళిత వ్యక్తిని చాలా చెడు మాటలతో దుర్భాషలాడుతూ, "నీ తల్లి ఎవరు, నా మాట ఎందుకు వింటావు?" అని అడిగాడు మరియు అతని కులం గురించి అవమానించాడు. ఆ యువకుడు కాల్ కట్ చేసిన తర్వాత, అతను ఆదివారం రాత్రి తెల్లవారుజామున 01.00 గంటల వరకు అతనికి చాలాసార్లు కాల్ చేశాడు. ఆ యువకుడు సహకరించకపోవడం తో డి. శెట్టిహల్లి గ్రామంలోని సాగర్‌కు ఫోన్ చేసి రవిని అతని తల్లి చంపేస్తాను, మరియు అతని కులాన్ని అవమానించాడు. విష్ణు యాదవ్ కూడా అతన్ని తిట్టాడు మరియు అదే పోలీస్ స్టేషన్‌లో అభిలాష్ అనే వ్యక్తిపై అనేక కేసులు నమోదయ్యాయి. అతనిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలి మరియు కుటుంబాన్ని రక్షించాలి. సులిబెలే పోలీస్ స్టేషన్ యొక్క పోలీస్ ఇన్స్పెక్టర్ త్వరగా భీమ్ సేవా సమితి సంస్థ పి ఎస్ ఐ రవికుమార్ సర్ దృష్టికి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు తీసుకున్న పోలీసులు పోలీస్ స్టేషన్‌లో సెక్షన్ 352, 351(2) బిఎన్ఎస్,ఆర్ఇవి/వి 3(1) (8)(ఎస్) ఎస్సీ ఎస్టీ చట్టం 2015 కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. షెడ్యూల్డ్ కులం మరియు షెడ్యూల్డ్ తెగ (అత్యాచారాల నివారణ) చట్టం, 1989 మరియు నేరంలో పాల్గొన్న దుండగుడిని అతి త్వరలో అరెస్టు చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రావణ్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు భీమ్ సేవా సమితి (ఆర్),యువజన రాష్ట్ర అధ్యక్షుడు గంగాధర్ బి సి,డ్రైవర్ అధ్యక్షుడు మునిరాజ్ బి ఆర్,ఆటో యూనిట్ అధ్యక్షుడుశ్రీనాథ్ సి,కార్మిక అధ్యక్షుడు వరుణ్ రాజ్ చక్రవర్తి,మైనారిటీ అధ్యక్షుడు సయ్యిద్ అగా,బె. గ్రా. జిల్లా అధ్యక్షుడు కిరణ్ పృథ్వీ,ఆటో యూనిట్ అధ్యక్షుడుసూర్య (సూరి),యూత్ అధ్యక్షుడు రవితేజ్ తరుణ్,లేబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినయ్ కుమార్, ఆటో రాష్ట్ర అధ్యక్షుడు నగేష్ సి, భీమ్ సేవా సమితి అధ్యక్షుడు రవి భువనహల్లి అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ పీజీ విద్యార్థుల హాస్టల్ ప్రవేశాలపై విశ్వవిద్యాలయ హెచ్చరిక

**హన్మకొండ, 7 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

డబుల్ పీజీ చదువుతున్న విద్యార్థులు విశ్వవిద్యాలయ హాస్టళ్లలో ప్రవేశానికి అర్హులు కాదని గతంలోనే స్పష్టమైన సూచనలు జారీ చేసినప్పటికీ, కొంతమంది డబుల్ పీజీ విద్యార్థులు నిబంధనలను ఉల్లంఘించి హాస్టల్ ప్రవేశాలు పొందినట్లు విశ్వవిద్యాలయ అధికారుల దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో, విశ్వవిద్యాలయ ఆదేశాలను అతిక్రమించి హాస్టల్‌లో చేరిన డబుల్ పీజీ విద్యార్థులందరూ తమ హాస్టల్ ప్రవేశాన్ని 2026 జనవరి 9వ తేదీ సాయంత్రం 5.00 గంటలలోపు తప్పనిసరిగా రద్దు చేసుకోవాలని విశ్వవిద్యాలయ వసతి గృహ సంచాలకులు డాక్టర్ ఎల్. పి. రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. నిర్దేశించిన గడువులోపు హాస్టల్ ప్రవేశాన్ని రద్దు చేసుకోని పక్షంలో, సంబంధిత విద్యార్థుల హాస్టల్ ప్రవేశం తక్షణమే రద్దు చేయబడుతుందని, అలాగే వారు చెల్లించిన హాస్టల్ డిపాజిట్ ఎట్టి పరిస్థితుల్లోనూ తిరిగి చెల్లించబడదని ఆయన హెచ్చరించారు. అంతేకాకుండా, అవసరమైతే కళాశాల ప్రవేశం రద్దుకు కూడా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ అంశంపై ఇకపై ఎలాంటి వినతులు, అభ్యర్థనలు స్వీకరించబోమని డాక్టర్ ఎల్. పి. రాజ్‌కుమార్ తన ప్రకటనలో మరోసారి తేల్చి చెప్పారు. విశ్వవిద్యాలయ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, విద్యార్థులు ఈ విషయాన్ని గంభీరంగా పరిగణించి నిర్ణీత గడువులోపు చర్యలు తీసుకోవాలని విశ్వవిద్యాలయ వసతి గృహ శాఖ అధికారులు సూచించారు.

# కేయూలో బయోటెక్నాలజీ పరిశోధనా గ్రంథాల ఆవిష్కరణ




**హన్మకొండ, 7 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయం బయోటెక్నాలజీ విభాగ విశ్రాంత ఆచార్యులు ఆచార్య రామస్వామి నానా సంపాదకత్వంలో, విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థులు రచించిన పరిశోధనా గ్రంథాలను కేయూ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బయోటెక్నాలజీ రంగంలో జరిగిన ముఖ్యమైన పరిశోధనలను ప్రతిబింబించే రెండు శాస్త్రీయ గ్రంథాలు ఆవిష్కరణ పొందాయి. ఈ సందర్భంగా డాక్టర్ ఘన్ సింగ్ మాలోత్, డాక్టర్ రజినీకాంత్ మారక రచించిన "ఇన్ విట్రో కన్సర్వేషన్ అఫ్ ఆన్ ఎత్నోమెడిసినల్ ప్లాంట్ టర్కీ బెర్రీ " అనే పరిశోధనా గ్రంథంతో పాటు, డాక్టర్ శ్యామసుందరా చారి రుద్రోజు, డాక్టర్ రజినీకాంత్ మారక సంయుక్తంగా రచించిన "ఇన్ విట్రో కన్సర్వేషన్ , ఫితోకెమికల్ ఎనాలిసిస్ అండ్ జనటిక్ ఫిడెలిటీ అఫ్ త్రీస్తేనేది మెడిసినల్లీ ఇంపార్టెంట్ క్యూసురేబిట్ ట్రొసాంత్స్ క్యూసుమెరిన ఎల్ "అనే మరో పరిశోధనా గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ పుస్తకాలు ఔషధ మొక్కల సంరక్షణ, వాటి జన్యు స్వచ్ఛత, ఫైటోకెమికల్ విశ్లేషణ వంటి అంశాలపై విలువైన శాస్త్రీయ సమాచారాన్ని అందిస్తున్నాయని కార్యక్రమంలో పాల్గొన్న విద్యావేత్తలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి, నిరంతర పరిశోధనల ద్వారానే సమాజానికి ఉపయోగకరమైన సత్ఫలితాలు సాధ్యమవుతాయని తెలిపారు. విశ్వవిద్యాలయాలు కేవలం విద్య అందించే కేంద్రాలుగా కాకుండా, సమాజ అవసరాలకు అనుగుణంగా పరిశోధనలను ముందుకు తీసుకెళ్లే బాధ్యత వహించాలని ఆయన సూచించారు. ముఖ్యంగా బయోటెక్నాలజీ వంటి రంగాల్లో జరిగే పరిశోధనలు ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, ఔషధ రంగ అభివృద్ధికి దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం, డీన్ ఆచార్య జి. హనుమంత్, బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ టి. శాస్త్రితో పాటు డాక్టర్ పి. శ్రీనివాస్, డాక్టర్ దాసరి సమ్మయ్య, డాక్టర్ కోమల, డాక్టర్ నరేందర్, డాక్టర్ విక్రం, డాక్టర్ పి. మహేందర్ తదితర అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు. మొత్తంగా ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమం కేయూ లో జరుగుతున్న పరిశోధనల నాణ్యతను, బయోటెక్నాలజీ విభాగం శాస్త్రీయ కృషిని ప్రతిబింబిస్తూ శాస్త్రీయ వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

# నా జీవితం సమాజ సేవకు అంకితం

**మడిపల్లి మాజీ సర్పంచ్ సుమలత విజయకుమార్**



**హాసన్‌పర్తి, 7 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

సమాజ సేవే తన జీవిత లక్ష్యమని, ప్రజల కష్టసుఖాల్లో భాగస్వాములవ్వడమే నిజమైన ప్రజాసేవ అని మడిపల్లి మాజీ సర్పంచ్ చిర్ర సుమలత విజయకుమార్ గౌడ్ అన్నారు. హాసన్‌పర్తి మండల పరిధిలోని గ్రామానికి చెందిన అన్నపురపు చేరాలు ఇటీవల మృతి చెందడంతో, వారి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ సర్పంచ్ సుమలత విజయకుమార్, మృతుడికి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసి, ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రామ ప్రజల సమస్యలు, బాధలు తనకు ఎంతో సమీపమైనవని, ఎలాంటి హోదా ఉన్నా లేకపోయినా ప్రజలకు అండగా నిలవడమే తన ధర్మమని పేర్కొన్నారు. గ్రామంలో ఎవరికైనా కష్టం వచ్చినప్పుడు ముందుగా స్పందించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులదేనని, సమాజంలో ఐక్యత, మానవీయ విలువలు నిలబడాలంటే ఒకరికొకరు సహకరించుకోవాల్సిన అవసరం ఉందని ఆమె తెలిపారు. "నా జీవితం సమాజ సేవకే అంకితం. ప్రజల నమ్మకాన్ని ఎప్పటికీ వృథా చేయను" అని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కాందారి ప్రదీప్, గ్రామ అధ్యక్షుడు మాచర్ల మహేందర్ ప్రత్యేకంగా పాల్గొన్నారు. వారి వెంట వార్డ్ మెంబర్లు, గ్రామ కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై బాధిత కుటుంబానికి తమ సంఘీభావాన్ని తెలియజేశారు. గ్రామ నాయకులు మాట్లాడుతూ, మాజీ సర్పంచ్ సుమలత విజయకుమార్ సేవాభావం గ్రామానికి ఆదర్శమని, ఆమె ప్రజల మధ్య ఉండి చేసే సేవలు ప్రశంసనీయమని అన్నారు. బాధిత కుటుంబ సభ్యులు కూడా ఈ సమయంలో స్పందిస్తూ, కష్ట సమయంలో తమను పరామర్శించి సహాయం అందించిన మాజీ సర్పంచ్‌కు, గ్రామ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం గ్రామంలో ఆత్మీయ వాతావరణంలో సాగుతూ, మానవత్వం, పరస్పర సహకారం ఎంత ముఖ్యమో మరోసారి చాటిచెప్పింది.

# ఏసీబీ వలలో నందిగామ ఎంపీడీవో, ఎంపీఓ

**లక్ష రూపాయలు లంచం తీసుకుంటూ అడ్డంగా బుక్ అయిన అధికారులు**

**హైద్రాబాద్, 7 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

షాద్‌నగర్ నియోజకవర్గంలో లంచం వ్యవహారం కలకలం రేపింది. నందిగామ మండలానికి చెందిన ఎంపీడీవో, ఎంపీఓలు భవన నిర్మాణానికి అనుమతుల విషయంలో లంచం డిమాండ్ చేస్తూ రూ.లక్ష తీసుకుంటుండగా తెలంగాణ రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు అడ్డంగా చిక్కారు. వివరాల ప్రకారం, నందిగామ మండల ఎంపీడీవో సుమతి, ఎంపీఓ తేజ్ సింగ్, ఈదులపల్లి గ్రామ కార్యదర్శి చెన్నయ్య కలిసి ఓ భవన నిర్మాణానికి సంబంధించిన పనుల్లో అనుకూలంగా వ్యవహరించేందుకు లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఫిర్యాదు అందుకున్న రంగారెడ్డి జిల్లా ఏసీబీ డీఎస్పీ ఆధ్వర్యంలోని బృందం పథకం రచించి, లంచం తీసుకుంటున్న సమయంలో అధికారులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది. ఈ ఘటనకు సంబంధించిన సమాచారంతో ఏసీబీ అధికారులు నిందితులపై కేసు నమోదు చేసి, తదుపరి దర్యాప్తు చేపట్టారు. ప్రభుత్వ శాఖల్లో అవినీతికి తావులేకుండా కఠిన చర్యలు కొనసాగుతాయని ఏసీబీ అధికారులు స్పష్టం చేశారు. ఈ వ్యవహారం స్థానికంగా తీవ్ర చర్చకు దారి తీసింది.



# విద్యార్థులు పోరాట పటిమ, సామాజిక స్పృహ కలిగి ఉండాలి : దాస్యం వినయ్ భాస్కర్

**హనుమకొండ, 7 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

విద్యార్థులు కేవలం చదువులకే పరిమితం కాకుండా పోరాట పటిమతో పాటు సామాజిక స్పృహను కలిగి ఉండాలని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు నగదు ప్రోత్సాహకాలు అందజేసిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కాకతీయ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ జట్టి రాజేందర్ అధ్యక్షతన బుధవారం రోజున బాలసముద్రంలోని భారత రాష్ట్ర సమితి పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమ సమయంలో బీఆర్ఎస్ పార్టీకి అనుబంధంగా బీఆర్ఎస్ విద్యార్థి విభాగం అలుపెరగని పోరాటం చేసిందని గుర్తు చేశారు. విద్యా రంగ సమస్యలు, విద్యార్థుల సమస్యలపై బీఆర్ఎస్వీ నిరంతరం పోరాడుతోందని తెలిపారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మహిళా భద్రత, సంప్రదాయాలు అనే అంశాలపై విద్యార్థినుల కోసం ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులు చదువులతో పాటు ఉద్యోగ సాధనపైనా



దృష్టి సారించాలని, భవిష్యత్తు లక్ష్యాలను స్పష్టంగా నిర్ధారించుకుని ముందుకు సాగాలని సూచించారు. సమాజంలో జరుగుతున్న పరిణామాలపై అవగాహన కలిగి ఉండి, అవసరమైనప్పుడు ప్రశ్నించే తత్వం, పోరాట పటిమతో నిలబడాలని హితవు పలికారు. విద్యార్థులకు ఎల్లవేళలా అండగా ఉంటానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముగ్గుల పోటీల్లో విజేతలైన వందన, నవ్య, లావణ్య బృందాలకు దాస్యం వినయ్ భాస్కర్ నగదు బహుమతులు అందజేశారు. అలాగే ఇటీవల ఎండీ సీటు సాధించిన ఆటో డ్రైవర్ మేకల రమేష్ కుమార్తె మేకల హర్షిణికి ప్రత్యేకంగా నగదు సహాయం అందించి అభినందించారు. ఇది విద్యార్థుల విద్యా ప్రోత్సాహానికి బీఆర్ఎస్వీ ఎంతగానో కట్టుబడి ఉందనడానికి నిదర్శనమని కార్యక్రమంలో పాల్గొన్నవారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంగాల సూర్య కిరణ్ వర్మ, గంద్రకోట రాకేష్ యాదవ్, పస్తం అనిల్, కోరపెల్లి రాజేష్, ప్రశాంత్, బొల్లపెల్లి వీరస్వామి, స్నేహిత్, సందీప్ యాదవ్, పబ్బోజు శ్రీకాంత్ చారి, తక్కళ్లపల్లి వినీల్ రావు తదితర బీఆర్ఎస్, బీఆర్ఎస్వీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మొత్తం మీద ఈ కార్యక్రమం విద్యార్థుల్లో సామాజిక చైతన్యం, సంప్రదాయ విలువలు, పోరాట స్ఫూర్తిని పెంపొందించేలా ఉత్సాహభరితంగా సాగింది.

# వందేమాతరంపై ఫోటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య






**హన్మకొండ, 7 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

భారత స్వాతంత్ర్య ఉద్యమానికి ప్రాణం పోసిన వందేమాతరం గేయానికి 150 ఏళ్లు పూర్తైన సందర్భాన్ని గుర్తుచేసే అరుదైన ఛాయాచిత్రాలతో కూడిన ఫోటో ఎగ్జిబిషన్‌ను కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సెంట్రల్ బ్యూరో అఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) వరంగల్ కార్యాలయం నిర్వహించింది. ఈ మూడురోజుల ఎగ్జిబిషన్‌ను కడియం కావ్య, వరంగల్ లోక్‌సభ సభ్యులు, బుధవారం పింగళి మహిళా డిగ్రీ కళాశాలలో ప్రారంభించారు. ఎగ్జిబిషన్ ప్రారంభానంతరం ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ వందేమాతరం కేవలం ఒక గీతం కాదని, అది భారత స్వాతంత్ర్య పోరాటానికి ప్రాణం పోసిన త్యాగస్ఫూర్తి, దేశభక్తి, జాతీయ ఐక్యతకు ప్రతీక అని అన్నారు. మహాకవి బంకించంద్ర చటర్జీ సుమారు 150 ఏళ్ల క్రితం రచించిన ఈ గీతం భారతమాత ఔన్నత్యం, ఆధ్యాత్మిక వైభవం, సాంస్కృతిక గొప్పతనాన్ని ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. బ్రిటిష్ పాలకుల "విభజించి పాలించు" విధానానికి వ్యతిరేకంగా ప్రజలను ఏకం చేసిన శక్తి వందేమాతరమేనని, కులంమతంప్రాంత భేదాలు మరిచి "దేశమే ప్రథమం" అనే భావనను పెంపొందించిందని తెలిపారు. 1938లో నాటి హైదరాబాద్ సంస్థానంలో వందేమాతర ఉద్యమాన్ని నిజాం ప్రభుత్వం నిషేధించిన విషయాన్ని గుర్తుచేస్తూ, ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మాజీ ప్రధాని పీ.వి. నరసింహారావు సహా పలువురు ఆ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని ఆమె పేర్కొన్నారు. తాను పాఠశాల విద్యార్థినిగా ఉన్నప్పుడు వందేమాతరం గేయాన్ని ఆలపించి బహుమతి సాధించిన అనుభవాన్ని కూడా గుర్తుచేశారు. నేటి తరం వందేమాతరం 150వ ఉత్సవాలను స్ఫూర్తిగా తీసుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. విద్యార్థులు, యువత విద్యాకెరీర్‌పై దృష్టి సారించి విజయాలు సాధించాలని, సోషల్ మీడియాపై అప్రమత్తంగా ఉండాలని, ఆత్మవిశ్వాసంతో సవాళ్లను ఎదుర్కొని స్వావలంబనతో ఎదగాలని ఎంపీ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీల విజేతలకు ఎంపీ డాక్టర్ కావ్య బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. అంతకు ముందు ఈ ఎగ్జిబిషన్‌ను స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సందర్శించారు. సీబీసీ అసిస్టెంట్ డైరెక్టర్ కోటేశ్వర్‌రావు ప్రారంభ ప్రసంగంలో వందేమాతరం గేయం స్వాతంత్ర్య పోరాటంలో పోషించిన కీలక పాత్రను వివరించారు. జాతీయ వాదాన్ని పునరుద్దీపింపజేయడం, పౌరులు దేశంతో భావోద్వేగపరంగా, సాంస్కృతికంగా మళ్లీ అనుసంధానమయ్యేలా చేయడమే ఈ కార్యక్రమ లక్ష్యమని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ బి. చంద్రమౌళి మాట్లాడుతూ ప్రతి ఏడాది వందేమాతరం పై కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. వందేమాతరం 150 ఏళ్ల సందర్భాన్ని గుర్తుచేసే అరుదైన చిత్రాలు, భారత రాజ్యాంగ నిర్మాణ ఘట్టాలతో కూడిన ఈ ప్రత్యేక ప్రదర్శన జనవరి 7 నుంచి 9 వరకు అందుబాటులో ఉంటుంది. సందర్శకుల కోసం సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేసినట్లు సీబీసీ ఫీల్డ్ పబ్లిసిటీ అధికారి బి. తరుణ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, వివిధ కళాశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇనగాల వెంకట్రాంరెడ్డికి గజమాలతో సన్మానం





**ఆత్మకూర్, 7 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నూతనంగా డిసిసి అధ్యక్షులుగా నియమితులైన, అలాగే కో-ఆప్ చైర్మన్‌గా ఉన్న ఇనగాల వెంకట్రాంరెడ్డికి ఘనంగా గజమాలతో సన్మానం నిర్వహించారు. బుధవారం హనుమకొండలోని డిసిసి భవన్‌లో ఆయన అధికారికంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా, యూత్ కాంగ్రెస్ పరకాల నియోజకవర్గ అధ్యక్షుడు మాదాసి శ్రీధర్ ఆధ్వర్యంలో సుమారు 100 మంది యువజన కాంగ్రెస్ నాయకులు హాజరై ఇనగాల వెంకట్రాంరెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు గజమాలలతో సన్మానిస్తూ, పార్టీ బలోపేతానికి ఆయన నాయకత్వం కీలకంగా నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం మాట్లాడిన ఇనగాల వెంకట్రాంరెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులకు ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. యువతే కాంగ్రెస్ పార్టీకి బలమని పేర్కొంటూ, వారి సమస్యలు, ఆశయాలు, రాజకీయ భవిష్యత్తు కోసం నిరంతరం పోరాడతానని తెలిపారు. పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయడంలో యువత పాత్ర అత్యంత కీలకమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైస్ ప్రెసిడెంట్ అచ్చ వర్ష, దామెర మండల అధ్యక్షుడు నల్ల సుధాకర్, ఆత్మకూరు అధ్యక్షుడు తనువుల సందీప్, సంగెం అధ్యక్షుడు రమేష్ నాయక్, నడికూడా అధ్యక్షుడు కుమారస్వామితో పాటు పిట్టల రాజ్ కుమార్, ప్రవీణ్, శ్రవణ్, మురళి తదితర యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మొత్తంగా ఈ సన్మాన కార్యక్రమం కాంగ్రెస్ పార్టీలో యువత ఉత్సాహాన్ని, ఐక్యతను ప్రతిబింబిస్తూ, హనుమకొండ డిసిసి భవన్‌లో ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

# సంక్రాంతి రద్దీకి స్పెషల్ బస్సులు సిద్ధం 50శాతం అదనపు ఛార్జీలు విధించిన టీజీఎస్ఆర్టీసీ

**హైద్రాబాద్, 7 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని తెలంగాణ రాష్ట్ర రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (టీజీఎస్ఆర్టీసీ) భారీ ఏర్పాట్లు చేసింది. పండుగ రోజుల్లో ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా మొత్తం 6,431 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు సంస్థ ప్రకటించింది. ఈ ప్రత్యేక బస్సులు జనవరి 9, 10, 12, 13, 18, 19 తేదీల్లో హైదరాబాద్ నుంచి తెలంగాణలోని వివిధ జిల్లాలకు, అలాగే ఇతర రాష్ట్రాల కీలక మార్గాల్లో నడవనున్నాయి. ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండే రూట్లలో అదనపు సర్వీసులు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అయితే, ఈ ప్రత్యేక బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులపై సాధారణ ఛార్జీల కంటే 50 శాతం అదనపు ఛార్జీలు వసూలు చేయనున్నట్లు టీజీఎస్ఆర్టీసీ స్పష్టం చేసింది. పండుగ రద్దీతో పాటు అదనపు నిర్వహణ వ్యయాల కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ప్రయాణికులు ముందస్తుగా టికెట్లు బుక్ చేసుకోవాలని, అధికారిక వెబ్‌సైట్ లేదా సమీప బస్ స్టేషన్లలో పూర్తి వివరాలు తెలుసుకోవాలని టీజీఎస్ఆర్టీసీ సూచించింది. పండుగ ప్రయాణం సురక్షితంగా, సౌకర్యవంతంగా ఉండేలా అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు.

# విషాదాంతం అయిన ప్రేమజంట జీవితం

## ఉరేసుకుని ప్రేమికురాలు బలవన్మరణం తట్టుకోలేక ప్రియుడు కూడా ఆత్మహత్య ఇరు కుటుంబాల్లో పెను విషాదం

**హైదరాబాద్,జనవరి7(జై భీమ్ న్యూస్):**

ప్రియురాలి మరణాన్ని తట్టుకోలేక ప్రియుడు పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బ్రాహ్మణపల్లె గ్రామంలో చోటుచేసుకుంది. మంగళవారం రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మేడిపల్లిలో పూజ అనే 17 ఏళ్ల యువతి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తమ బిడ్డ ఆత్మహత్యకు కారణం అదే గ్రామానికి చెందిన సిద్దగోని మహేష్ అని మృతురాలి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం మహేష్ కూడా ఆత్మహత్య చేసుకున్నాడు. రంగారెడ్డి జిల్లా బ్రాహ్మణపల్లె సమీపంలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని.. నిప్పంటించుకుని తీవ్ర గాయాలతో మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. గతంలో కూడా వీరిద్దరు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నంకు పాల్పడి కోలుకున్నారు. గత కొంతకాలంగా మహేష్, పూజ ప్రేమించుకున్నట్లు సమాచారం. ఇలా ప్రేమ కారణంగా అనేక మంది యువతీ యువకులు క్షణికావేశంలో ప్రాణాలు తీసుకుంటున్నారు. కొందరు హత్య చేస్తుండగా.. మరికొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ప్రేమలో మోసపోయామని కొందరు, పెద్దలు ఒప్పుకోలేదని మరికొందరు ఇలా తమ నూరేళ్ల జీవితాన్ని అర్ధాంతరంగా ముగిస్తున్నారు. :వారిద్దరు ఒకరినొకరు ప్రేమించుకున్నారు. జీవితాంతం కలిసి జీవించాలని కలలు కన్నారు. అందుకు పెద్దలు ఒప్పుకోలేదు. దీంతో ఒకరు లేకుండా మరొకరు ఉండలేక చావే శరణ్యమని భావించారు. ఉరేసుకొని ప్రియురాలు పెట్రోల్ పోసుకొని నేడు ప్రియుడు ఇద్దరు బలవన్మరణానికి పాల్పడ్డారు. క్షణికావేశంతో రెండు నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. దీంతో రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.రంగారెడ్డ జిల్లా యాచారం మండల పరిధిలోని మేడిపల్లి గ్రామంలో పోతురాజు అలివేలు కూతురు పోతురాజు పూజ (16)అనే విద్యార్థిని ఇబ్రహీంపట్నంలోని కార్తికేయ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నది. పూజా తండ్రి పదహారేళ్ల క్రితం మృతి చెందడంతో అప్పటినుంచి తన తల్లి అలివేలు కుమారుడు కుమార్తె ఇరువురిని పెంచి పోషించింది. అదే గ్రామానికి చెందిన సిద్ధగోని యాదయ్య కుమారుడు సిద్ధగోని మహేష్ (20) గత నాలుగు ఐదు నెలలుగా ఒకరినొకరు ప్రేమించుకుంటున్నారు. విషయం ఇరు కుటుంబాల్లో తెలవడంతో వీరిని గత కొన్ని రోజులుగా కలుసుకోకుండా చేశారు. దీంతో ఇటీవలే మహేష్ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడు. కొన్ని రోజులు దవాఖానాలో చికిత్స పొంది ప్రాణాలతో బయటపడ్డాడు. మహేష్ పురుగుల మందు తాగిన విషయాన్ని తెలుసుకున్న పూజ సైతం మందు తాగి ఆత్మహత్య చేసుకోవడానికి యత్నించింది. ఆమె సైతం ప్రాణాలతో బయటపడింది. పెళ్లి చేసుకోకుంటే చస్తానని మహేష్ ఫోన్ చేసి చెప్పడంతో...పూజ మానసిక ఒత్తిడికి గురైంది. తన ప్రియుడు ఆత్మహత్య చేసుకుంటాడేమోనని దిగులుతో తానే మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉదయం ఎనిమిది గంటలకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పూజ మృతి చెందడంతో గ్రామంలో కొద్దిసేపు ఆందోళన




నెలకొంది. పోలీసుల రంగప్రవేశంతో పూజ మృతదేహాన్ని ఇబ్రహీంపట్నం మార్చురీకి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. సాయంత్రం మృతదేహాన్ని తీసుకొచ్చి పూడ్చిపెట్టారు. పూజ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని తెలుసుకున్న మహేష్ బుధవారం హయత్ నగర్ పరిధిలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో అటు పూజ ఇటు మహేష్ ఆత్మహత్య చేసుకుని చనిపోవడంతో మేడిపల్లి గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. ఇరు కుటుంబాలలో రోదనలు మిన్నంటాయి. ఈ మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# శ్రీ భద్రకాళి దేవస్థానంలో అభివృద్ధి పనుల పరిశీలన
# అమ్మవారిని దర్శించుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి





**వరంగల్, జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళి దేవస్థానంను గౌరవ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బుధవారం సాయంత్రం సందర్శించారు. దేవాలయంలో నిర్మాణంలో ఉన్న మాడవీధుల అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించిన అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి ఆలయానికి చేరుకున్న సందర్భంగా ఆలయ ఈవో రామల సునీత, ధర్మకర్తలు, అర్చకులు వేద స్వస్తి మంగళవాద్యాలతో ఘన స్వాగతం పలికారు. పూజానంతరం ఆలయ మహా మండపంలో మహాదాసీరత, మహాదాశివచనం నిర్వహించి శేష వస్త్రాలు బహూకరించి అమ్మవారి ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీనివాస్ రెడ్డితో పాటు ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ ఎంపీ కడియం కావ్య, నగర మేయర్ గుండు సుధారాణి పాల్గొన్నారు. అలాగే హనుమకొండ, వరంగల్ జిల్లా కలెక్టర్లు స్నేహ శబరిష్, సత్య శారద దేవి, వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్పాయ్, డిసిపీలు శుభం ప్రకాష్, మనీషాతో పాటు అధికారులు అజిత్ రెడ్డి, భీమ్ రావు, శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి, దొంతి మాధవరెడ్డి, కె.ఆర్. నాగరాజు, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా దేవాలయ ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, ఓరుగంటి పూర్ణచందర్, మయూరి రామేశ్వరరావు, గాండ్ల స్రవంతి, జారతి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. దేవస్థాన అభివృద్ధి పనులు వేగంగా పూర్తయ్యేలా అన్ని శాఖల సమన్వయంతో చర్యలు చేపడతామని మంత్రి తెలిపారు.

## అనంతసాగర్ గ్రామ శివారులో గుర్తు తెలియని వ్యక్తి మృతి



**హసన్‌పర్తి, 7 జనవరి 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**

హసన్‌పర్తి మండలంలోని అనంతసాగర్ గ్రామ శివారులో వట్టే వెంకట రమణ రెడ్డి కౌలుకు చేసిన పొలంలో గుర్తు తెలియని మగ వ్యక్తి మృతి చెందిన స్థితిలో కనిపించాడు. ఈ ఘటన గ్రామంలో కలకలం రేపింది. సమాచారం అందుకున్న వెంటనే హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలనలు చేపట్టారు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తు ప్రకారం మృతుడి వయస్సు సుమారు 40 నుంచి 45 సంవత్సరాలు ఉండవచ్చని అంచనా. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు, ఆ వ్యక్తి మానసిక స్థితి సరిగా లేక నిన్న ఉదయం అనంతసాగర్ గ్రామంలో తిరుగుతూ కనిపించినట్లు సమాచారం. మృతికి గల కారణాలపై స్పష్టత కోసం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి గుర్తింపునకు సంబంధించిన అనవాళ్లుగా నలుపు రంగు కోల మొహం, ఎడమ ఛాతి పై పుట్టుమచ్చ, నలుపుతెలుపు రంగు జుట్టు, గడ్డం, మీసాలు, ఎర్రనలుపుతెలుపు రంగుల గళ్లల అంగీ (షర్ట్), నసరం రంగు షార్ట్ (దానిపై "2020 ఒజూశీతీం" అని ఉంది), కుడి చేతికి ఎరుపు మరియు చిన్న పూసల దండ, ఎడమ చేతికి నలుపు దారం ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ వ్యక్తి గురించి ఎవరికైనా సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. వివరాల కోసం హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌ను 8712685015, ఎస్.ఐ.ను 8712685097, ఇన్స్పెక్టర్‌ను 8712685124 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## జనవరి 11 నుంచి హజరత్ మాషూక్-ఎ-రబ్బాని 470వ దర్గా ఉత్సవాలు



**వరంగల్, 7 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ నగరంలోని కరీమాబాద్ ప్రాంతంలో ఉన్న హజరత్ మాషూక్-ఎ-రబ్బాని దర్గాలో 470వ వార్షిక ఉత్సవాలు ఈ నెల 11, 12, 13 తేదీల్లో ఘనంగా నిర్వహించనున్నట్లు దర్గా పీఠాధిపతి నవీద్ బాబా తెలిపారు. ఈ ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన భక్తులను కోరారు. ఈ సందర్భంగా దర్గాలో ఉత్సవాల గోడపత్రికను నవీద్ బాబా ఆవిష్కరించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం, జనవరి 11వ తేదీ సాయంత్రం 5 గంటలకు దర్గా పీఠాధిపతి నివాసంలో ఫాతిమాతో ఉరుఫ్ ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 12వ తేదీన రాత్రి 9 గంటలకు సందల్ సాని కార్యక్రమంతో పాటు ప్రత్యేక వేడుకలు నిర్వహించనున్నారు. 13వ తేదీన ఖురాన్ పఠనం అనంతరం హజ్రత్ సయ్యద్ షా హైదర్ ఇల్లాలుద్దీన్ ఖాద్రి జిలానీకి ప్రత్యేక ప్రార్థనలు జరగనున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలకు దేశం నలుమూలల నుంచే కాకుండా విదేశాల నుంచి కూడా సుమారు 10 లక్షల మంది భక్తులు హాజరవుతారని అంచనా వేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పోలీస్, మున్సిపల్, విద్యుత్ శాఖలతో పాటు జిల్లా అధికారుల సమన్వయంతో అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామని నవీద్ బాబా వెల్లడించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని హజరత్ మాషూక్-ఎ-రబ్బాని 470వ దర్గా ఉత్సవాలను ఘనంగా, విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఖమ్మం నగరపాలక సంస్థలో బీఆర్ఎస్‌కు మరో షాక్

### సిఎం సమక్షంలో కాంగ్రెస్‌లోకి మరో ముగ్గురు కార్పోరేటర్లు

**హైదరాబాద్,జనవరి7(జై భీమ్ న్యూస్):**

ఖమ్మం నగరపాలక సంస్థలో బీఆర్ఎస్‌కు మరో షాక్ తగిలింది. ఇటీవల ఆ పార్టీకి చెందిన ఐదుగురు కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరగా.. బుధవారం మరో ముగ్గురు చేరారు. హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తాజాగా కాంగ్రెస్‌లో చేరిన కార్పొరేటర్లలో ధనియాల రాధ, తోట ఉమారాణి, రుద్రగాని శ్రీదేవి ఉన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. ఇటీవల బీఆర్ఎస్ నుంచి హస్తం పార్టీకి వచ్చిన కార్పొరేటర్లు సీహెచ్ లక్ష్మి, జి.చంద్రకళ, డి.సరస్వతి, అమృతమ్మ, ఎం.శ్రావణి సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాగమయి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పిపిపి మోడల్‌తో వైద్యసేవలకు ధోకా ఉండదు: సేథ్

**విజయవాడ,జనవరి7(జై భీమ్ న్యూస్):**

వైద్య కళాశాలల గుర్తింపు ప్రక్రియను సరళతరం చేయనున్నామని జాతీయ వైద్యమండలి ఛైర్మన్ అభిజిత్ సేథ్ తెలిపారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో అనవసర ఆలస్యాన్ని నివారించనున్నట్టు చెప్పారు. విజయవాడలోని ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయంలో వైస్ ఛాన్సలర్ చంద్రశేఖర్, రిజిస్ట్రార్ రాధికారెడ్డితో కలిసి అభిజిత్ సేథ్ మీడియా సమావేశంలో మాట్లాడారు. పీపీపీ మోడల్‌లో నిర్వహించే ఆసుపత్రులు ప్రభుత్వ ఆధీనంలోనే ఉంటాయని, పీపీపీ విధానం ద్వారా రోగులకు చికిత్స ఉచితంగా లేదా రాయితీపై అందుతుందని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు, ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం 50శాతం సీట్లు రాష్ట్ర మెరిట్ కోటా కింద భర్తీ అవుతాయని చెప్పారు. మిగిలిన 50శాతం సీట్లను ప్రైవేట్ యాజమాన్యం ఉపయోగించుకోవచ్చన్నారు. ప్రస్తుతం పీపీపీ విధానం అమలనేది రాష్ట్ర ప్రభుత్వాల చేతుల్లో ఉందని, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో ఈ విధానం ఇప్పటికే విజయవంతంగా కొనసాగుతోందని చెప్పారు. కార్పొరేట్ కంపెనీలు సైతం పీపీపీ ద్వారా వైద్యకళాశాలలు ఏర్పాటు చేయవచ్చన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు కలిసి పని చేయడం వల్ల అందుబాటులో ఉన్న వనరుల వినియోగం జరుగుతుందని అభిజిత్ సేథ్ చెప్పారు.

## ఏసిబి వలలో అవినీతి చేపలు

### లక్ష లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఎంపిడివో

**హైదరాబాద్,జనవరి7(జై భీమ్ న్యూస్):**

వివిధ చోట్ల పలువురు అధికారులు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. ఎంపీడీవో కార్యాలయంలో రూ.లక్ష లంచం తీసుకుంటుండగా రంగారెడ్డి జిల్లా నందిగామ ఎంపీడీవో సుమతి, ఏపీవో తేజ్ సింగ్, ఈదులపల్లి కార్యదర్శి చెన్నయ్యను ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ అరెస్ట్ చేశారు. నందిగామ మండల పరిధిలోని ఈదులపల్లి గ్రామంలో బొబ్బిలి ప్రవీణ్ చేపట్టిన భవన నిర్మాణానికి రూ.3.5లక్షలు లంచం ఇవ్వాలని అధికారులు డిమాండ్ చేశారు. గతంలో రూ.లక్ష ఇచ్చిన ప్రవీణ్.. ఈ వ్యవహారంపై ఏసీబీ అధికారులకు సమాచారం అందించారు. బుధవారం మరో రూ.లక్ష లంచం తీసుకుంటుండగా ముగ్గురినీ ఏసీబీ డీఎస్పీ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.హైదరాబాద్‌లోని బాగ్ అంబర్‌పేటలోని దేవాదాయ శాఖకు చెందిన భూమి సర్వే రిపోర్టు ఇచ్చేందుకు ఎండోమెంట్ ఇన్స్పెక్టర్ అక్కవరపు కిరణ్ కుమార్ రూ. 1.50లక్షలు లంచం డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో రూ.50వేలు లంచం తీసుకుంటుండగా కిరణ్ కుమార్‌ను ఏసీబీ అధికారులు కస్టడీలోకి తీసుకున్నారు

## కవిత రాజీనామాను ఆమోదించాం: గుత్తా

**హైదరాబాద్,జనవరి7(జై భీమ్ న్యూస్):**

ఎమ్మెల్సీ కవిత వచ్చి విజ్ఞప్తి చేయడంతోనే ఆమె రాజీనామాను ఆమోదించినట్లు తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తెలిపారు. భావోద్వేగంతో రాజీనామా చేసినప్పుడు కొంతకాలం వేచిచూస్తామని.. ఆమె విషయంలోనూ అదే జరిగిందన్నారు. హైదరాబాద్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. కవిత కొత్త పార్టీ ప్రకటనపైనా గుత్తా స్పందించారు. 'రాష్ట్రంలో కొత్తగా పార్టీలు పెట్టాల్సినంత అవసరం లేదు. కొత్త పార్టీ వచ్చినా మనుగడ కష్టం. గతంలో వచ్చిన పలు రాజకీయ పార్టీలు కనుమరుగయ్యాయి. ఏ ప్రాతిపదికన డీలిమిటేషన్ చేపడతారనే దానిపై స్పష్టత లేదు. జనాభా ప్రాతిపదికన జరిగిన దక్షిణాది రాష్ట్రాలకు నష్టం. హిల్ట్ విధానం ద్వారా ఎలాంటి అవినీతి జరగదు. కాలుష్యం కట్టడికి పారిశ్రామిక భూముల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం నిర్ణయించింది. ఉపాధి హామీ పథకంలో గాంధీ పేరు తొలగించడం సరికాదు' అని గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు.

## బైక్‌ను వేగంగా ఢీకొన్న ఆటో

### తల్లీ కొడుకులు దుర్మరణం

**కర్నూలు,జనవరి7(జై భీమ్ న్యూస్):**

జిల్లాలోని కౌతాళం మండలం ఎరిగేరి సమీపంలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ఎరిగెరి గ్రామంలో శ్రీ బంగారమ్మ అవ్వ మహోత్సవానికి వెళ్లారు తల్లీకొడుకు మహాదేవి, నాగిరెడ్డి. దేవర సందర్భంగా మొక్కులు తీర్చుకొని తిరిగి కౌతాళంకి బయలుదేరారు. అమ్మవారి దర్శనం తర్వాత ఎంతో సంతోషంగా వెళుతున్నవాహనాన్ని ఆటో రూపంలో మృత్యువు వెంటాడింది. వారు ప్రయాణిస్తున్న బైక్‌ని.. ఆటో ఢీ కొట్టడంతో ఎగిరి అవతల పడ్డారు. ప్రమాదంలో తల్లీ, కొడుకు తీవ్రంగా గాయపడటంతో కన్నుమూశారు. దైవ దర్శనానికి వెళ్లిన తల్లీకొడుకులు కన్నుమూయడంతో గ్రామంలో తీవ్ర విషాదంలో నెలకొంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదాల సంఖ్య విపరీతంగా పెరిగిపోతున్నాయి. డ్రైవర్ల నిర్లక్ష్యం వల్ల అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు. రోడ్డు భద్రతా చర్యలు ఎంత కఠినతరం చేస్తున్నా ప్రమాదాలను మాత్రం అరికట్టలేకపోతున్నారు.

## మద్యం మత్తులో వాహనాలు నడిపితే వందల కుటుంబాల జీవితాలే ధ్వంసం

### రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా హనుమకొండ ట్రాఫిక్ పోలీసుల విజ్ఞప్తి

**హనుమకొండ, జై భీమ్ న్యూస్**

ఒక్కరి నిర్లక్ష్యం వందల కుటుంబాల జీవితాలను నాశనం చేస్తుందని, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల జరిగే ప్రమాదాలు కేవలం వ్యక్తులకే కాకుండా సమాజానికే తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తున్నాయని హనుమకొండ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సీతారెడ్డి హెచ్చరించారు. 2026 రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా ఆయన తల్లిదండ్రులు, సమాజంలోని ప్రతి ఒక్కరికి కీలక విజ్ఞప్తి చేశారు. ఇటీవల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మద్యం మత్తులో వాహనాలు నడిపిన ఇద్దరి నిర్లక్ష్యం కారణంగా జరిగిన ప్రమాదాల్లో 43 మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఈ ఘటనల వల్ల 43 కుటుంబాలు తీవ్ర విషాదంలో మునిగిపోయాయని, ఒక్క ప్రమాదం వెనుక వందల మంది జీవితాలు తారుమారు అవుతున్నాయని పేర్కొన్నారు. శంకర్ కుటుంబం వంటి ఎన్నో కుటుంబాలు ఈ ప్రమాదాల కారణంగా రోడ్డున పడిపోయిన పరిస్థితులు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదాల్లో బస్ డ్రైవర్, క్లీనర్, లారీ డ్రైవర్, లారీ యజమాని, ట్రావెల్స్ యాజమాన్యం జైలు పాలవ్వగా, ట్రావెల్స్ కార్యాలయాలు మూసివేయబడటంతో వందల మంది ఉద్యోగులు ఉపాధి కోల్పోయారని తెలిపారు. మొత్తం మీద ఈ ఒక్క ప్రమాదం కారణంగా సుమారు 500 కుటుంబాలు ఆర్థికంగా, మానసికంగా తీవ్రంగా దెబ్బతిన్నాయని అన్నారు. వ్యాపారాలు మూతపడటంతో కుటుంబాలు అప్పుల్లో మునిగిపోయి, ఇఎంఐలు, అద్దెలు చెల్లించలేని దుస్థితికి చేరుకున్నాయని చెప్పారు. తల్లిదండ్రులు "నా పిల్లాడు అలాంటివాడు కాదు" అనే భావనను విడిచిపెట్టి, పిల్లలకు రోడ్డు భద్రత, బాధ్యత గురించి నేర్పాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా రాత్రి 10 గంటల తర్వాత పిల్లలు ఎక్కడ ఉన్నారో గమనించాలని సూచించారు. హనుమకొండ ట్రాఫిక్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల సమయంలో మద్యం సేవించి భార్యా, పిల్లలతో కలిసి వాహనాలు నడుపుతూ పట్టుబడుతున్న ఘటనలు చాలానే ఉన్నాయని సీతారెడ్డి తెలిపారు. ఇలాంటి ప్రవర్తనను పిల్లలు గమనిస్తారని, తల్లిదండ్రులే తప్పుదారి చూపిస్తే పిల్లలు సన్మార్గంలో నడవడం కష్టమవుతుందని హెచ్చరించారు. చాలా సందర్భాల్లో కుటుంబాన్ని నడిపించే వ్యక్తి ప్రమాదానికి గురై మరణించినా లేదా మంచానికే పరిమితమైనా ఆ కుటుంబం ఆర్థికంగా, సామాజికంగా తరతరాల వెనుకబడిపోతుందని తెలిపారు. నేటి పరిస్థితుల్లో తల్లి, తండ్రి ఇద్దరూ ఉన్నా పిల్లలను పెంచడం కష్టమవుతున్న తరుణంలో, తండ్రిని కోల్పోతే ఆ కుటుంబం పడే బాధలు వర్ణనాతీతమని అన్నారు. కావున మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, మీ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ప్రమాదం కలిగించవద్దని హనుమకొండ ట్రాఫిక్ పోలీసుల తరపున సీతారెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## జైలులో మత్తు పదార్థాల సరఫరా

### నిజామాబాద్ జైలర్ ఉపేందర్ సస్పెన్షన్

**నిజామాబాద్,జనవరి7(జై భీమ్ న్యూస్):**

జిల్లా జైలులో గంజాయి దొరికిన ఘటనపై ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. జైలులో డ్రగ్స్‌తో పాటు ఇతర మత్తు పదార్థాలు సరఫరా అవుతుందన్న ఆరోపణలపై జైళ్ల శాఖ డీఐజీ, ఐజీ పూర్తి స్థాయిలో విచారణ జరిపారు. ఈ విచారణ నివేదిక ఆధారంగా జైలర్ ఉపేందర్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. మరో జైలర్ సాయి సురేశ్‌ను ఆదిలాబాద్‌కు బదిలీ చేశారు. ఈ మేరకు జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా ఉత్తర్వులు ఇచ్చారు. అలాగే సూపరింటెండెంట్ దశరథాన్ని నెల రోజులు సెలవులపై వెళ్లాలని ఆదేశించారు. ఇక వరంగల్ జైలర్‌గా పనిచేస్తున్న పూర్ణచందర్‌కు నిజామాబాద్ జైలర్‌గా అదనపు బాధ్యతలు ఇచ్చినట్లు తెలుస్తోంది. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆనంద్‌రావుకు ఇంచార్జి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు అప్పగించారు. జైలు అధికారులతో కలిసి పనిచేసినట్లు తేలిన ఖైదీలను ఇతర జైళ్లకు మార్చారు.

# పారిశ్రామిక ప్రదర్శనలో అటవీ శాఖ స్టాల్

**హైదరాబాద్,జనవరి7(జై భీమ్ న్యూస్):**

నాంపల్లి అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనలో ఏర్పాటు చేసిన అటవీ శాఖ స్టాల్‌ను తెలంగాణ రాష్ట్ర అటవీశాఖ ప్రధాన అటవీ సంరక్షకులు డా. సువర్ణ బుధవారం ప్రారంభించారు. అటవీలు, పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్యం మరియు వన్యప్రాణుల సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు తెలంగాణ అటవీ శాఖ చేపడుతున్న వివిధ కార్యక్రమాలను ప్రదర్శించడమే ఈ స్టాల్ ప్రధాన ఉద్దేశ్యం. ఈ అటవీ శాఖ ప్రదర్శనలో అటవీ సంరక్షణ, వన్యప్రాణి నిర్వహణ, పరిశోధన, సమాజ భాగస్వామ్యం వంటి విభాగాల్లో శాఖ చేపడుతున్న కార్యక్రమాలను సమగ్రంగా చూపిస్తున్నారు. వివిధ నమూనాలు, పోస్టర్లు, సమాచార ఫలకాలు మరియు ఇంటరాక్టివ్ అంశాల ద్వారా అన్ని వయస్సుల సందర్శకులకు అటవీల ప్రాముఖ్యత, పర్యావరణ సమతుల్యతలో వాటి పాత్ర గురించి అవగాహన కల్పించేలా ఏర్పాటు చేశారు. ఫారెస్ట్ కాలేజ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ , నెహ్రూ జూలాజికల్ పార్క్, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్, అలాగే వెదురు ఉత్పత్తుల విభాగాల ద్వారా ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేశారు. ఈ స్టాళ్లలో పరిశోధన కార్యకలాపాలు, వన్యప్రాణి సంరక్షణ చర్యలు, ఈకో టూరిజం కార్యక్రమాలు మరియు అటవీ ఆధారిత జీవనోపాధుల అభివృద్ధిపై సమాచారం అందిస్తున్నారు. వెదురు ఉత్పత్తుల ప్రదర్శన ద్వారా అటవీ ఆధారిత ఉత్పత్తులకు విలువ జోడించడం, అటవీ ప్రాంత ప్రజలకు ఉపాధి కల్పించడం పై శాఖ దృష్టిని తెలియజేస్తోంది. ఈఅఖీఎ ద్వారా తయారైన స్వచ్ఛమైన తేనె విక్రయం ఈ ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఇది సహజ అటవీ ఉత్పత్తుల ప్రోత్సాహం మరియు శాస్త్రీయ తేనెటీగల పెంపకం పట్ల అటవీ శాఖ చేస్తున్న కృషికి ప్రతీకగా నిలుస్తోంది. పిల్లలు మరియు కుటుంబాల కోసం ప్రత్యేకంగా పక్షుల మినీ జూ ఏర్పాటు చేయబడింది. దీని ద్వారా చిన్నారులు పక్షుల వైవిధ్యాన్ని దగ్గరగా చూసి తెలుసుకునే అవకాశం కలుగుతోంది. అంతేకాకుండా అటవీ శాఖ కార్యకలాపాలు, వన్యప్రాణి సంరక్షణ కార్యక్రమాలు, రాష్ట్రవ్యాప్తంగా సాధించిన విజయాలను చూపించే వీడియోలను నిరంతరం ప్రదర్శించే ఏర్పాటు చేశారు. జంతువుల ప్రతిరూపాలతో సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేయడం ద్వారా సందర్శకులను ఆకట్టుకునేలా, అలాగే వన్యప్రాణి సంరక్షణ సందేశాన్ని సృజనాత్మకంగా అందించేలా ప్రత్యేక ఆకర్షణలు కల్పించారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో శ్రీ రత్నాకర్ జౌహరి, శ్రీమతి ప్రియాంక వర్గీస్, శ్రీ కృష్ణ, పాల్గొన్నారు.

# కాశ్మీర్‌లో ఎన్‌కౌంటర్

### ముగ్గురు ఉగ్రవాదుల హతం

**శ్రీనగర్,జనవరి7(జై భీమ్ న్యూస్):**

జమ్మూకశ్మీర్ లోని కథువా జిల్లాలో ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులను భద్రతా బలగాలు చుట్టుముట్టినట్టు తెలుస్తోంది. ఈ ప్రాంతంలో ఇద్దరు ముగ్గురు ఉగ్రవాదులు సంచరిస్తున్నట్టు సమాచారం అందడంతో గాలింపు చర్యలు జరుపుతున్నట్టు అధికారులు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 4 గంటల ప్రాంతంలో బిలావర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కమద్ నల్లా సమీపంలో ఒక టెర్రరిస్టును స్థానికులు గుర్తించారు. ధన్ను పరోల్ వద్ద కూడా ఉదయం అతన్ని చూసినట్టు అధికారులకు సమాచారం అందింది. దీంతో అదనపు బలగాలు ఆ ప్రాంతానికి చేరుకున్నాయి. ఎస్‌ఓజీతో పాటు సీఆర్‌పీఎఫ్ బలగాలు సంయుక్తంగా ఈ ఆపరేషన్ చేపట్టినట్టు జమ్మూ ఐజీపీ భీమ్ సేన్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలిపారు. ఏడాది భద్రతా బలగాలు చేపట్టిన తొలి కీలక ఆపరేషన్ ఇదేనని, జమ్మూ ఐజీ, కథువా ఎస్ఎస్‌పీ శర్మ సంయుక్తంగా ఈ ఆపరేషన్‌ను పర్యవేక్షిస్తున్నారని భద్రతా బలగాలు తెలిపాయి. ప్రస్తుతం ఎదురెదురు కాల్పులు కొనసాగుతున్నాయి.

# ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు పరిశీలకులు

## పుదుచ్చేరి, తమిళనాడుకు ఉత్తమ్ నియాకం

**న్యూఢిల్లీ,జనవరి7(జై భీమ్ న్యూస్):**

త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న రాష్ట్రాలకు సీనియర్ పరిశీలకులను ఏఐసీసీ బుధవారంనాడు నియమించింది. అస్సాం, కేరళ, తమిళనాడు-పుదుచ్చేరి, పశ్చిమబెంగాల్‌కు ఈ పరిశీలకులను నియమించింది. ఈ నియమకాలు తక్షణం అమల్లోకి వచ్చినట్టు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. తమిళనాడు, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలకు ఏఐసీసీ పరిశీలకుడిగా తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి నియమితులయ్యారు. నాలుగు రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల పర్యవేక్షణకు ఏఐసీసీ సీనియర్ పరిశీలకులను నియమించింది. అస్సాం, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అస్సాం ఎన్నికల పరిశీలకులుగా భూపేష్ భగేల్, డీకే శివకుమార్, బంధు టిర్కి, కేరళకు సచిన్ పైలెట్, కేజె జార్జ్, ఇమ్రాన్, కన్హయ్య కుమార్, తమిళనాడు, పుదుచ్చేరికి పరిశీలకులుగా ముఖుల్ వాస్కి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఖాజి మహ్మద్ నిజాముద్దీన్.. పశ్చిమ బెంగాల్‌కు సుదీప్ రాయ్ భర్మన్, షకీల్ అహ్మద్ ఖాన్, ప్రకాష్ జోషిని నియమించినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శ కేసీ వేణుగోపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. అస్సాం రాష్ట్రానికి మాజీ సీఎం భూపేష్ బఘేల్, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, బంధు తిర్కీ ఏఐసీసీ సీనియర్ పరిశీలకులుగా నియమితులయ్యారు. కేరళ పరిశీలకులుగా రాజస్థాన్ మాజీ డిప్యూటీ సీఎం సచిన్ పైలట్, కేజే జార్జ్, ఇమ్రాన్ ప్రతాప్‌గఢి, కన్హయ్య కుమార్ నియమితులయ్యారు. తమిళనాడు, పుదుచ్చేరి పరిశీలకులుగా ముకుల్ వాస్నిక్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఖాజీ మె?హమ్మద్ నిజాముద్దీన్ పరిశీలకులుగా ఉంటారు. పశ్చిమబెంగాల్‌కు సుదీప్ రాయ్ బర్మన్, షకీల్ అహ్మద్ ఖాన్ పరిశీలకులుగా నియమితులయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో క్షేత్ర స్థాయిలో పార్టీ వ్యూహాలను అమలు చేయడం, అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల ప్రచారానికి సమన్వయం చేయడంలో సీనియర్ పర్యవేక్షకులు కీలక పాత్ర పోషించనున్నారు.

# నకిలీ మద్యం కేసులో కీలక పరిణామం

## మరో నలుగురిని విచారించేందుకు అనుమతి

**విజయవాడ,జనవరి7(జై భీమ్ న్యూస్):**

గత కొన్ని నెలల నుంచి సంచలనంగా మారిన విజయవాడ నకిలీ మద్యం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఇప్పటికే పలువురుని విచారించిన ఎక్సైజ్ కోర్టు తాజాగా మరో నలుగురిని విచారించేందుకు అనుమతినిచ్చింది. అన్నమయ్య జిల్లా ములకలచెరువు, విజయవాడ కేంద్రంగా వెలుగు చూసిన నకిలీ మద్యం రాకెట్‌లో ప్రధాన నిందితులకు సహకరించిన వారిని పోలీసులు తమ కస్టడీలోకి తీసుకున్నారు. తాజాగా నకిలీ మద్యం కేసులో బాలాజీ , తలారి రంగయ్య , సుదర్శన్ , ప్రసాద్ లను శుక్రవారం నుంచి సోమవారం వరకు కస్టడీకి ఎక్సైజ్ కోర్టు అనుమతినిచ్చింది. నిందితుల నుంచి మరింత కీలక సమాచారాన్ని సేకరించాల్సిన అవసరం ఉందని భావించిన ఎక్సైజ్ కోర్టు.. పోలీసుల విజ్ఞప్తి మేరకు ఈ కస్టడీని అనుమతించినట్లు తెలుస్తోంది. ఈ కేసులో ఇప్పటికే మాజీ మంత్రి జోగి రమేశ్, ఆయన సోదరుడు జోగి రాములను పోలీసులు విచారించిన విషయం తెలిసిందే. తాజాగా మరో నలుగురి కస్టడీ ద్వారా నకిలీ మద్యం కేసులో మరిన్ని కీలక అధారాలు లభిస్తాయని ఎక్సైజ్ అధికారులు భావిస్తున్నారు.

# ఖమ్మం జిల్లాకు కాంగ్రెస్ చేసిందేమీ లేదు

### ఫిబ్రవరిలో మున్సిపల్ ఎన్నికలు ?
### అధికారులను సన్నద్ధం చేసిన కమిషనర్
### కలెక్టర్లు, అఅధికారులతో వీడియో కాన్ఫరెన్స్
### ఓటర్ల జాబితాల సవరణ, అభ్యంతరాలపై షెడ్యూల్
### ఎన్నికల నిర్వహణకు సన్నద్ధంగా ఉండాలని ఆదేశం

**హైదరాబాద్,జనవరి7(జై భీమ్ న్యూస్):**

తెలంగాణలో ఇటీవలే గ్రామ పంచాయతీ ఎన్నికలు సమమర్థంగా నిర్వహించిన రాష్ట్ర ఎన్నికల సంఘం.. తాజాగా మున్సిపల్ ఎన్నికలపై దృష్టి సారించింది. ఈ ఎన్నికల సన్నద్ధతపై రాష్ట్ర ఎన్నికల సంఘం(ఎస్ఈసీ) కసరత్తు చేస్తోంది. తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణ కోసం రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) పూర్తి స్థాయిలో సన్నద్ధమవుతోంది. ఈ మేరకు జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, మున్సిపల్, కార్పొరేషన్ కమిషనర్లతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల పక్రియ సజావుగా సాగేందుకు తీసుకోవాల్సిన చర్యలు, టైమ్‌లైన్స్‌పై కమిషన్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసారు. అందుకోసం బుధవారం జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లతో రాష్ట్ర ఎన్నికల సంఘం ఉన్నతాధిరులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈాష్ట్ర వ్యాప్తంగా గతేడాది డిసెంబర్‌లో మూడు విడతలుగా గ్రామ పంచాయతీ ఎన్నికలను రాష్ట్ర ఎన్నికల సంఘం విజయవంతంగా నిర్వహించింది. తాజాగా.. మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు సన్నాహాలు చేపట్టింది. అందుకోసం జిల్లా, మున్సిపల్ ఉన్నతాధికారులతో ఎస్ఈసీ కీలక సమావేశం నిర్వహించింది. ఈ మున్సిపల్ ఎన్నికలు ఫిబ్రవరిలో జరుగుతాయని ఒక చర్చ సైతం సాగుతోంది. ఈ క్రమంలో తాజా ఆదేశాల మేరకు జనవరి 12లోగా ఓటర్ల తుది జాబితా ప్రచురించాలని ఈ సందర్భంగా ఆయా అధికారులను ఎస్ఈసీ ఆదేశించింది. అలాగే జనవరి 13న టీ పోల్ యాప్‌లో పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితా అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేసింది. ఇక.. జనవరి 16న పోలింగ్ స్టేషన్ల వారీగా.. ఫొటోలతో కూడిన తుది ఓటర్ల జాబితా ప్రచురించాలని సూచించింది. బ్యాలెట్ బాక్సులు, అవసరమైన సామగ్రి సిద్ధం చేయాలని జిల్లా ఉన్నతాధికారులకు ఎస్ఈసీ ఆదేశించింది. ఇక 2019 నాటి ఓటర్ల జాబితానే ప్రాతిపదికగా తీసుకోవాలని స్పష్టం చేసింది. పోలింగ్ స్టేషన్లలో బీఎల్‌వోల ద్వారా ఓటర్ల వివరాలను పరిశీలన చేయాలని సూచించింది. ఆన్‌లైన్‌లో కూడా ఓటరు నమోదు, మార్పులకు అవకాశమిచ్చిందని వివరించింది. ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాల ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల నియమావళిని కఠినంగా అమలు చేయాలని జారీచేసిన ఆదేశాల్లో ఎస్ఈసీ స్పష్టం చేసింది. జనవరి 12 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ, 13 వరకు అభ్యంతరాల పరిశీలన ప్రారంభం, 16న ఓటరు జాబితా విడుదల చేయాలని ఆదేశం ఇచ్చారు. సమావేశంలో భాగంగా కలెక్టర్లకు ముఖ్యంగా ఓటర్ల జాబితా, పోలింగ్ స్టేషన్ల వివరాల ప్రచురణపై డెడ్‌లైన్లు నిర్దేశించారు. జనవరి 12వ తేదీ నాటికి తుది ఓటర్ల జాబితాను తప్పనిసరిగా ప్రచురించాలని ఈసీ ఆదేశించింది. 13వ తేదీ నాటికి పోలింగ్ స్టేషన్ల వివరాలతో కూడిన ముసాయిదా జాబితాను విడుదల చేసి, వెంటనే టీ పోల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఇక, జనవరి 16వ తేదీ లోపు పోలింగ్ స్టేషన్ల పూర్తి వివరాలతో పాటు ఫోటోలతో కూడిన తుది జాబితా, తుది ఓటర్ల జాబితాను వార్డు పరిధిలోని అన్ని పోలింగ్ స్టేషన్లలో ప్రదర్శించాలని ఆదేశించారు. ఈ చర్య ద్వారా ఓటర్లకు తమ పోలింగ్ కేంద్రం, వివరాలు సులభంగా అందుబాటులోకి వస్తాయని ఈసీ పేర్కొంది. ఎన్నికల నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులపై కూడా ఈసీ కలెక్టర్లకు దిశానిర్దేశర చేసింది. పోలింగ్‌కు అవసరమైన బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సిబ్బంది నియామకం, రిటర్నింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్స్, సిట్టింగ్/సర్వైలెన్స్ స్క్వాడ్స్ను నియమించి, ఎన్నికల పక్రియను పర్యవేక్షించాలని కమిషన్ సూచించింది. మరోవైపు, ఎన్నికల ఏర్పాట్లు పారదర్శకంగా, సమయపాలనతో జరిగితేనే ప్రజాస్వామ్య పక్రియ బలోపేతమవుతుందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ స్పష్టం చేశారు. కలెక్టర్లు ఈ డెడ్‌లైన్లను కచ్చితంగా పాటిస్తూ, అన్ని విభాగాలను సమన్వయం చేసుకుని ఎన్నికలకు సిద్ధం కావాలని ఆదేశించారు. అయితే, మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకు సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో ఈసీ తీసుకున్న ఈ నిర్ణయాలు ఎన్నికల వేళ కీలకంగా మారనున్నాయి. ఓటర్లకు ఇబ్బందులు లేకుండా ఎన్నికలు జరగాలనే లక్ష్యంతోనే ఈ ఆదేశాలు జారీ చేసినట్లు కమిషన్ వర్గాలు వెల్లడించాయి.

# సిఎం కప్ క్రీడల పోస్టర్ ఆవిష్కరించిన రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,జనవరి7(జై భీమ్ న్యూస్) :**

సీఎం కప్-2025 సెకండ్ ఎడిషన్ పోస్టర్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి, శాట్స్ ఛైర్మన్ శివసేనా రెడ్డి, స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, సిఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీనివాసరాజు, సోనీబాల తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 17 నుంచి 22 వరకు గ్రామస్థాయి, 28 నుంచి31 వరకు మండలస్థాయి, ఫిబ్రవరి 3 నుంచి 7 వరకు నియోజకవర్గ స్థాయి, ఫిబ్రవరి 10 నుంచి 14 వరకు జిల్లా స్థాయి, ఫిబ్రవరి 19 నుంచి 26 వరకు రాష్ట్ర స్థాయి పోటీలు జరుగనున్నాయి. మొత్తం 44 రకాల క్రీడల్లో పోటీలు నిర్వహించనున్నట్లు మంత్రి వాకిటి శ్రీహరి వెల్లడించారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం

### నవీన్ రావు తండ్రికి సిట్ నోటీసులు

**హైదరాబాద్,జనవరి7(జై భీమ్ న్యూస్):**

ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్ రావు తండ్రి కొండల్ రావుకు సిట్ అధికారులు నోటీసులు ఇచ్చారు. అంతేకాదు.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కొడుకు సందీప్ రావుకు కూడా నోటీసులు ఇచ్చారు. బుధవారం మధ్యాహ్నం ఒంటి గంటకు జూబ్లీహిల్స్ పీఎస్‌కి రావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. రెండు రోజుల క్రితం ఎమ్మెల్సీ నవీన్ రావును సిట్ అధికారులు విచారించారు. దాదాపు 9 గంటల పాటు విచారణ సాగింది. ఉదయం 11 గంటలకు మొదలైన విచారణ రాత్రి 8 గంటల వరకు సాగింది. బీఆర్ఎస్ పెద్దలతో ఉన్న ఆర్థిక సంబంధాల గురించి నవీన్ రావును అధికారులు విచారించినట్లు సమాచారం. విచారణ అనంతరం నవీన్ రావు మీడియాతో మాట్లాడుతూ.. గతంలో విచారణకు హాజరయ్యానని, అప్పట్లో మూడు గంటల పాటు అధికారులు తనను విచారించారని చెప్పారు. అప్పుడు చెప్పిన విషయాలనే ఇప్పుడు కూడా చెప్పానని అన్నారు. విచారణకు సహకరించానని, మళ్లీ పిలిచినా కూడా వస్తానని స్పష్టం చేశారు.

# తమిళనాట మారుతున్న సమీకరణాలు

### అన్నా డిఎంకె కూటమిలోకి పిఎంకె

**చెన్నై,జనవరి7(జై భీమ్ న్యూస్):**

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న తరుణంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. అన్నాడీఎంకే, బీజేపీ కూటమి తో పట్టలి మక్కల్ కట్టి పిఎంకె చేతులు కలిపింది. పీఎంకే అధ్యక్షుడు అంబుమణి రామదాస్ తమిళనాడు మాజీ సీఎం, అన్నాడీఎంకే చీఫ్ పళనిస్వామిని కలుసుకుని ఎన్డీయే కూటమిలో చేరుతున్నట్టు ప్రకటించారు. అంబుమణి రామదాస్‌తో కలిసి పళనిస్వామి మీడియాతో మాట్లాడుతూ, పీఎంకే చేరికతో తమ కూటమి మరింత బలపడిందని, మరి కొన్ని పార్టీలు కూడా తమతో చేరేందుకు సిద్ధంగా ఉన్నాయన చెప్పారు. తమది 'విక్టరీ అలయెన్స్' అని ప్రకటించారు. అన్నాడీఎంకే నాయకత్వంలో ఎన్డీయేలో చేరేందుకు పీఎంకే చేతులు కలిపినట్టు అంబుమణి రామదాస్ తెలిపారు. మహిళల భద్రత, రైతులు, నిరుద్యోగం వంటి అంశాల్లో అధికార డీఎంకేపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, డీఎంకేను గద్దె దించడమే లక్ష్యంగా తాము పనిచేస్తామని చెప్పారు. భారీ మెజారిటీతో గెలిచి అన్నాడీఎంకే నాయకత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాగా, ఈ ఏడాది ప్రథమార్థంలో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.

# అదుపులోకి వస్తున్న బ్లో ఔట్

**కోనసీమ,జనవరి7(జై భీమ్ న్యూస్):**

మలికిపురం మండలం ఇరుసుమండలో ఓఎన్‌జీసీ సైట్ నుంచి ఎగసిపడుతున్న మంటలు నేడు కాస్త అదుపులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మహేశ్ కుమార్ కీలక ప్రకటన చేశారు. పరిసరాల్లోని నాలుగు గ్రామాల్లో పరిస్థితి అదుపులో ఉందని అన్నారు. బ్లోఅవుట్ పరిసర ప్రాంతాల్లోని వారు తిరిగి తమ ఇళ్లకు రావొచ్చని తెలిపారు. ఆ ప్రాంతాలను వీడిన వారిలో 90 శాతం మంది ఇప్పటికే తిరిగొచ్చారని చెప్పారు. మంటల కారణంగా ఇప్పటివరకూ జరిగిన నష్టం వివరాలను కూడా అంచనా వేస్తున్నామని తెలిపారు. ఈ ఘటనపై ఓఎన్‌జీసీ డైరెక్టర్ కూడా విజయ్ సక్సేనా కూడా ఇటీవలే స్పందించారు. బ్లోఅవుట్ వల్ల ఎలాంటి ప్రమాదం లేదని చెప్పారు. మంటలను పూర్తి స్థాయిలో అదుపులోకి తెచ్చేందుకు వారం రోజులు పట్టొచ్చని కలెక్టర్ కూడా ఈ సందర్భంగా చెప్పారు. మూడు పైపుల ద్వారా తీవ్ర ఒత్తిడితో నీటిని వెదజల్లుతూ మంటలను అదుపుచేస్తున్నట్టు వివరించారు. ఇప్పటికే అధికారులు ఇరుసుమండలో విద్యుత్ సరఫరాను కూడా పునరుద్ధరించారు. ఇదిలా ఉంటే, బ్లోఅవుట్‌కు సంబంధించిన కారణాలపై విచారణ జరపాలని ఎంపీ హరీశ్ కోరారు. ఓఎన్‌జీసీ డ్రిల్లింగ్ నిర్వహించే ప్రతి సైట్ వివరాలూ ప్రజలకు తెలియజేయాలని స్పష్టం చేశారు. పాత గ్యాస్ పైప్‌లైన్‌లను కూడా మార్చాలని కోరారు.

# ముషీరాబాద్ స్క్రాప్ గోడౌన్‌లో అగ్నిప్రమాదం

**హైదరాబాద్,జనవరి7(జై భీమ్ న్యూస్):**

నగరంలోని ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని భోలక్‌పూర్ గుల్షన్ నగర్‌లో స్క్రాప్ గోదాంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఆ ప్రాంతంలో వరుసగా ఉన్న ప్లాస్టిక్ గోదాం, వైట్ల గోదామూకీ మంటలు విస్తరిస్తోన్నాయి. స్క్రాప్ గోదాం నుంచి భారీగా మంటలు ఎగిసిపడుతున్నాయి. స్థానికులు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి ముషీరాబాద్ పోలీసులు చేరుకున్నారు. మూడు ్గ÷ర్ ఇంజన్‌లతో అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టారు.

## చైనా, రష్యాల, క్యూబాలతో దోస్తీ కట్ చేసుకో

వాషఙంగ్టన్,జనవరి7(జై భీమ్ న్యూస్): అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన రెండో దఫా పాలనలో విదేశాంగ విధానం ద్వారా తన ఆకాంక్షలను తీర్చుకునే పనిలో పడ్డారు. రాత్రికి రాత్రి వెనెజువెలాపై కమాండో దాడి జరిపి ఆ దేశ అధ్యక్షుడిని, ఆయన భార్యను బందీలుగా అమెరికాకు తరలించి ట్రంప్ తన పంతం నెరవేర్చుకున్నారు. అంతటితో ఆగని ట్రంప్.. దక్షిణ అమెరికా దేశాన్ని మొత్తం తానే నియంత్రిస్తున్నట్లు ప్రకటించుకుంటున్నారు. ఈ క్రమంలో ఇప్పుడు వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ ప్రభుత్వానికి ట్రంప్ కీలక హెచ్చరికలు చేసినట్లు తెలుస్తోంది. వెనెజువెలా కొత్త నాయకత్వం చైనా, రష్యా, ఇరాన్, క్యూబాలతో ఆర్థిక సంబంధాలను తెంచుకోవాలని హెచ్చరించినట్లు సమాచారం. అంతేకాదు, చమురు ఉత్పత్తిలో అమెరికాతో మాత్రమే భాగస్వామ్యం చేయాలని, ముఖ్యంగా హెవీ క్రూడ్ ఆయిల్ విక్రయాల్లో అమెరికాకు ప్రాధాన్యం ఇవ్వాల్సిందిగా ఒత్తిడి చేస్తున్నట్లు సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియా పేర్కొంటోంది. వెనెజువెలా చమురు ఉత్పత్తిని పెంచుకోవాలంటే తాను పెట్టిన ఈ షరతులు పాటించాలని ట్రంప్ టీమ్ స్పష్టం చేసినట్లు ఏబీసీ న్యూస్ నివేదిక వెల్లడించింది. 'మొదట ఆ దేశం (వెనెజువెలా) చైనా, రష్యా, ఇరాన్, క్యూబాతో ఆర్థిక సంబంధాలను తెంచుకోవాలి. రెండోది.. వెనెజువెలా చమురు ఉత్పత్తిలో అమెరికాతో ప్రత్యేక భాగస్వామిగా ఉండేందుకు, భారీ ముడి చమురు విక్రయాల్లో అమెరికాకు అనుకూలంగా ఉండేందుకు అంగీకరించాలి' అని ట్రంప్ టీమ్ షరతులు పెట్టినట్లు సదరు నివేదిక పేర్కొంది.

జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
Jai Bheem



# హీరోయిన్ కోసం ఓ డైరెక్టర్ సొంత భార్యను కోమాలోకి వెళ్లేలా కొట్టాడు: పూనమ్ కౌర్

టాలీవుడ్ నటి పూనమ్ కౌర్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేసింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పూనమ్ మాట్లాడుతూ, టాలీవుడ్‌లోని ఓ ప్రముఖ డైరెక్టర్ ఓ హీరోయిన్ కోసం తన భార్యను తీవ్రంగా చిత్రహింసలకు గురి చేశాడని ఆరోపించింది. అతడు తన భార్యను దారుణంగా కొట్టడంతో ఆమె కోమాలోకి వెళ్లిపోయిందని, ఆసుపత్రిలో వారం రోజుల పాటు చికిత్స పొందాల్సి వచ్చిందని చెప్పింది. ఇలాంటి దారుణం జరిగినా ఆ భార్య ఎవరికీ చెప్పకుండా మౌనంగా ఉండిపోయిందని, అన్యాయం జరిగినా బయటకు రాలేదని పూనమ్ విచారం వ్యక్తం చేసింది. అంతేకాకుండా, ఆ హీరోయిన్ సినిమా ఈవెంట్లకు కూడా హాజరవుతూ ఉండేదని, ఈ విషయం తెలిసినప్పుడు తాను చాలా షాక్ అయ్యానని, మనుషులు ఇలా కూడా ఉంటారా? అనిపించిందని చెప్పింది. అయితే, పూనమ్ ఆ డైరెక్టర్ పేరును మాత్రం బహిరంగంగా చెప్పలేదు. హీరోయిన్ ఎవరన్నది కూడా రివీల్ చేయలేదు. దీంతో సోషల్ మీడియాలో ఈ వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. నెటిజన్లు ఆ డైరెక్టర్ ఎవరు? ఆ హీరోయిన్ ఎవరు? అని పలు ఊహాగానాలు చేస్తున్నారు. సోషల్ మీడియాలో ఈ అంశం మరోసారి హాట్ టాపిక్ అయింది. కొందరు పూనమ్‌ను సపోర్ట్ చేస్తూ, ఇండస్ట్రీలోని ఇలాంటి దారుణాలు బయటపడాలని అంటున్నారు. మరికొందరు మాత్రం పేరు చెప్పకుండా ఇలా మాట్లాడటం వల్ల గందరగోళం పెరుగుతుందని వాదిస్తున్నారు. మొత్తంగా ఈ వ్యాఖ్యలు టాలీవుడ్‌లో కొత్త చర్చకు తెరలేపాయి.



# నాన్న నుంచి ప్రతి రోజూ ఏదో ఒకటి నేర్చుకోవచ్చు...

**చిరంజీవి గురించి సుస్మిత ఆసక్తికర వ్యాఖ్యలు**
**పని మొదలుపెడితే ప్రాణం పెట్టి చేస్తారని తండ్రి చిరంజీవి గురించి చెప్పిన సుస్మిత**
**ఇంట్లో ఎంతో సరదాగా ఉంటారని వెల్లడి**
**సెట్ లో అడుగుపెడితే పనిపైనే ఫోకస్ చేస్తారన్న సుస్మిత**

మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'మన శంకర వరప్రసాద్ గారు'. సాహు గారపాటితో కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న చిరంజీవి కుమార్తె, నిర్మాత సుస్మిత కొణిదెల తన తండ్రితో కలిసి పనిచేయడంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నేర్చుకోవాలనే తపన ఉంటే తన తండ్రి నుంచి ప్రతిరోజూ ఎన్నో విషయాలు నేర్చుకోవచ్చని ఆమె అన్నారు. ఎందరికో స్ఫూర్తిగా నిలిచే చిరంజీవితో పనిచేయడం ద్వారా నేర్చుకున్న పాఠాల గురించి ఇటీవల మీడియా అడిగిన ప్రశ్నకు ఆమె బదులిచ్చారు. ఈ సినిమా ద్వారా ఒక ముఖ్యమైన విషయం నేర్చుకున్నానని సుస్మిత తెలిపారు. "ఏదైనా ఒక పని మొదలుపెడితే, దానికి మన జీవితాన్ని అంకితం చేయాలి. నిజాయతీగా, కష్టపడి పనిచేయాలి అనే విషయాన్ని నాన్న నుంచే నేర్చుకున్నాను. ఇంట్లో మాతో ఎంతో ప్రేమగా, సరదాగా ఉంటారు. కానీ, ఒకసారి సెట్‌లో అడుగుపెట్టారంటే ఆయన ఏకాగ్రత మొత్తం పాత్రపైనే ఉంటుంది. ఈ రోజుకీ తన మొదటి సినిమాకు సిద్ధమైనట్టే సన్నద్ధమవుతారు" అని ఆమె వివరించారు. ఈ అంకితభావమే ఆయన్ను ఈ స్థాయిలో నిలబెట్టిందని ఆమె అభిప్రాయపడ్డారు. సినిమాకు సంబంధించిన మరో కీలక అప్‌డేట్‌ను నిర్మాతలు పంచుకున్నారు. 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రం ఇప్పటికే సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుందని తెలిపారు. సెన్సార్ బోర్డు సభ్యులు సినిమాను ఎంతగానో ఆస్వాదించారని, పిల్లలు, కుటుంబ సభ్యులతో కలిసి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడదగిన 'క్లీన్ ఫిల్మ్' అని ప్రశంసించినట్లు వెల్లడించారు. ఈ రిపోర్ట్ పట్ల చిత్ర బృందం సంతోషం వ్యక్తం చేసింది. తెలుగు సినీ పరిశ్రమలోని ఇద్దరు అగ్ర నటులు, మెగాస్టార్ చిరంజీవి, విక్టరీ వెంకటేశ్ తొలిసారి కలిసి నటిస్తున్న చిత్రం కావడంతో 'మన శంకర వరప్రసాద్ గారు'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. యువ దర్శకుడు అనిల్ రావిపూడి ఈ మాస్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌కు దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే చిరంజీవి, వెంకటేశ్ లపై ఒక ప్రత్యేక గీతాన్ని కూడా చిత్రీకరించారు. ఈ కాంబినేషన్ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. 'సైరా నరసింహారెడ్డి', 'గాడ్‌ఫాదర్' చిత్రాల తర్వాత నయనతార మరోసారి చిరంజీవితో కలిసి నటిస్తుండటం విశేషం. షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై సాహు గారపాటి, సుస్మిత కొణిదెల ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, శ్రీమతి అర్చన సమర్పిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తుండగా, సమీర్ రెడ్డి సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. తమ్మిరాజు ఎడిటింగ్, ఏ.ఎస్. ప్రకాష్ ఆర్ట్ డైరెక్షన్ బాధ్యతలు చేపట్టారు. ఎస్. కృష్ణ, జి. ఆదినారాయణ కథను అందించారు. ఈ చిత్రం 2026 సంక్రాంతి కానుకగా జనవరి 12న విడుదల కానుంది.

# నా భార్య నన్ను కొడుతోంది..

**ఆమె నుంచి ప్రాణహాని ఉంది**
**పోలీసులకు ఫిర్యాదు చేసిన కన్నడ నటుడు**
**భార్య అర్షితపై పోలీసులకు ఫిర్యాదు చేసిన కన్నడ నటుడు ధనుశ్ రాజ్**
**శారీరక దాడి, వేధింపులతో పాటు ప్రాణహాని ఉందని ఆరోపణ**
**రౌడీలతో కొట్టిస్తానని, చంపేస్తానని బెదిరిస్తోందన్న నటుడు**
**బెంగుళూరు గిరినగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు**

కన్నడ చిత్ర పరిశ్రమలో నటుడిగా, టీవీ సీరియళ్ల ద్వారా గుర్తింపు పొందిన ధనుశ్ రాజ్, తన భార్య అర్షితపై పోలీసులకు సంచలన ఫిర్యాదు చేశారు. తన భార్య తనపై శారీరకంగా దాడి చేసిందని, వేధింపులకు గురిచేస్తోందని, ప్రాణహాని బెదిరింపులకు పాల్పడుతోందని ఆరోపిస్తూ బెంగళూరులోని గిరినగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ధనుశ్ తన ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం అర్షిత తనకు సరిగా చెప్పకుండా విదేశాలకు వెళ్లింది. ఈ విషయంపై తాను ప్రశ్నించినందుకు ఆమె తనపై దాడి చేసిందని తెలిపారు. అంతేకాకుండా రౌడీలను పంపి కొట్టిస్తానని, అవసరమైతే చంపేస్తానని కూడా బెదిరించినట్లు ఆయన ఆరోపించారు. అర్షిత బాత్రూమ్‌లోని గ్లాస్ ప్యానెల్‌కు చేయి కొట్టుకుని కావాలనే గాయపరచుకుందని, ఆ దాడికి తానే కారణమని చిత్రీకరించే ప్రయత్నం చేసిందని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ఆత్మహత్య చేసుకుని తనను ఇరికిస్తానని కూడా ఆమె బెదిరించినట్లు ధనుశ్ ఆరోపించారు. భార్య నుంచి వస్తున్న నిరంతర వేధింపులు, బెదిరింపుల నేపథ్యంలో తనకు రక్షణ కల్పించాలని కోరుతూ పోలీసులను ఆశ్రయించక తప్పలేదని ధనుశ్ తన ఫిర్యాదులో వివరించారు. ఈ ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# ప్రతి పరిచయం వెనుక ఒక పరమార్థం వుంటుంది: సాయికుమార్

**శంబాల మూవీ థ్యాంక్స్ మీట్‌లో మాట్లాడిన సాయి కుమార్**
**విమానంలో ప్రయాణిస్తున్న సమయంలో పక్క సీటులో వారి ఫోన్ నెంబర్ తీసుకుంటానన్న సాయి కుమార్**
**అనేక మంది ప్రముఖులు ఫ్లైట్‌లో పరిచయం అయ్యారని వెల్లడి**

ప్రతి పరిచయం వెనక ఒక పరమార్థం ఉంటుందని నటుడు సాయి కుమార్ అన్నారు. ఆది సాయి కుమార్ ప్రధాన పాత్రలో నటించిన శంబాల మూవీ విజయోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన థాంక్స్ మీట్‌లో సాయి కుమార్ మాట్లాడారు. తాను విమానాల్లో ప్రయాణిస్తున్న సమయంలో కచ్చితంగా పక్కవారిని పరిచయం చేసుకుని వారి ఫోన్ నెంబర్ తీసుకుంటానని సాయి కుమార్ తెలిపారు. ఆ తర్వాత రోజు ఉదయం నుంచే ఆ పరిచయం చేసుకున్న వారితో సంభాషణలు చేస్తూ ఉంటానన్నారు. ఇలా తనకు ఎంతో మంది ప్రముఖులు ఫ్లైట్‌లో పక్క సీట్లో పరిచయం అయ్యారని చెప్పారు. ప్రతి పరిచయం వెనుక ఒక పరమార్థం ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు.

